

కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36(ఆదివారం)
కనిష్ఠం : 27

'21న జిల్లా విద్యాశాఖ కార్యాలయాల ముట్టడి' 5

ల్యాబ్‌ల.. చీటింగ్!



రాజమహేంద్రవరానికి చెందిన ధీరజ్‌కు జ్వరం రావడంతో ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు.. డాక్టర్ ఏమిటి సమస్య అని అడిగి సుమారు 10కి పైనే టెస్ట్‌లు రాశాడు.. అది చూసి ధీరజ్ ఆశ్చర్యపోయాడు.. ఇవన్నీ చేయించాలా సార్ అని అడిగాడు.. అందుకే రాసిచ్చింది అంటూ డాక్టర్ సీరియస్ అయ్యాడు.. ధీరజ్ టెస్ట్‌లన్నీ చేయించుకున్నాడు. అంతా బాగానే ఉందని రిపోర్టు వచ్చింది.. ఆ రిపోర్టు చూసి డాక్టర్ బాగానే ఉందని చెప్పి పంపించాడు.. దీనికి ఖర్చెంతయ్యిందో తెలుసా.. అక్షరాలా రూ.5 వేలు.. గతంలో అయితే నాడి పట్టుకుని చూసి రోగం ఏంటో చెప్పేవారు.. మరి నేడు వైద్య వృత్తి వ్యాపారంగా మారిపోయింది. టెస్ట్ చేయించనిదే రోగమేంటో చెప్పలేని దుస్థితిలో వైద్యులు తయారయ్యారు.. ఎందుకంటే వైద్యులకు డబ్బు జబ్బు పట్టుకుంది. ల్యాబ్ ఒక టెస్ట్ రాస్తే.. ఫీజు రూ.100 అనుకుంటే.. డాక్టర్‌కు రూ.60.. ల్యాబ్‌కు రూ.40.. దీంతో ల్యాబ్‌లు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి.

ఒక మహిళకు సైనసైటిస్ ఉందని వైద్యుడు సీటీ స్కానింగ్ రాశారు. ఆ సీటీ స్కానింగ్ చేయించుకొని ఆ వైద్యుడి వద్దకు వెళితే మందులిచ్చారు. కానీ తగ్గుము ఖం పట్టలేదు. దీంతో ఆమె మరో వైద్యుడి వద్దకు వెళ్లారు. అక్కడ స్కానింగ్ ఫిల్మ్ చూసిన డాక్టర్.. అసలు వ్యాధి సైనసైటిస్ కాదని అనుమానించి మరో సారి స్కానింగ్ రాశారు. దీనిని మరో ల్యాబ్‌లో చేయించు కోగా కణితి ఉందని రిపోర్టులో రాశారు. బయాప్సీ చేయగా నాసో ఫరింజల్ కార్సినోమా(క్యాన్సర్) అని తేలింది. ముందు స్కానింగ్‌కీ, రెండో స్కానింగ్‌కీ మధ్య నెల గడిచిపోయింది. దీంతో క్యాన్సర్ రెండో స్టేజికి వెళ్లిపోయింది. అదే ముందు స్కానింగ్ రిపోర్టులోనే గుర్తించి ఉంటే.. మరి దీనికి బాధ్యులు ఎవరు?.. ఈ ఒక్క ఉదాహరణ చాలు.. ప్రైవేటు ల్యాబ్‌లు ప్రజల ప్రాణాలతో ఎలా ఆడుకుంటున్నాయో తెలియడానికి!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఒకనాడు ల్యాబ్‌లో పరీక్ష చేయించాలంటే రోగులకు అనవసరపు ఖర్చు ఎందుకా అని వైద్యులు ఆలోచించేవారు.. నేడు కోట్లు ఖర్చు పెట్టి చదువుతున్నారు..ఆ జాలి లేదు. దయ లేదు..ఎంత వస్తే అంత రానీ అంతే. ప్రస్తుతం ఎలా ఉందంటే జ్వరం వచ్చిందా?.. టెస్టులు చేయించేయండి. తలపోటా? ఎందుకైనా మంచిది సీటీ స్కాన్ చేయించేద్దాం. ఇలా రోగుల భయాన్నే పెట్టుబడిగా పెట్టి మెడికల్ ల్యాబ్‌లు దందా సాగిస్తున్నాయి. దీంతో ప్రైవేటు ల్యాబ్‌ల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఉదాహరణకు షుగర్(మధుమేహం) టెస్టు చేయాలంటే ల్యాబ్‌లకు రూ.20 ఖర్చవుతుంది. కానీ రూ.150 వరకూ లాగేస్తున్నారు. ఇదిలా ఉంటే.. చట్ట వ్యతిరేకంగా గర్భస్థ శిశు నిర్ధారణ జరుగుతోందనే ఆరోపణలున్నాయి.. అధికారులు మాత్రం మామూళ్లు చేజారిపోతాయనే భయంతో తనిఖీలకు జంకుతున్నారు. కొన్ని ల్యాబ్‌లలో అనధికారికంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు సమాచారం.

జిల్లాలో 350 ల్యాబ్‌లు..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చిన్న, పెద్ద ల్యాబ్‌లు 350 వరకూ ఉన్నాయి. ఇవి రిజిస్ట్రేషన్ అయినవి..ఏ అనుమతులూ లేకుండా నడుస్తున్నవి మరో అన్ని ఉంటాయి. అన్ని ల్యాబ్‌ల వాళ్లకూ డాక్టర్లతో కనెక్షన్ ఉంటోంది. దీంతో అవసరం లేకపో యినా వైద్య పరీక్షలు రాస్తున్నారు. ల్యాబ్ పేరుతో ఉన్న చీటీపైనే వైద్యుడు ఏమి పరీక్షలు కావాలో రాస్తాడు. దీంతో అదే ల్యాబ్‌కి వెళ్లాల్సి వస్తోంది. అక్కడి ఎంత మొత్తం అడి గితే అంతా జమ చేయాల్సిందే. ఒక వైద్యుడు రాయగా టెస్టులు చేయించుకొని.. ఆ రిపోర్టు లను మరో వైద్యుడికి చూపిస్తే.. అబ్బే అవి పని చేయవంటూ మళ్లీ మొదటినుంచీ అన్ని టెస్టులూ రాస్తున్నారు. దీంతో మళ్లీ వైద్య పరీ క్షలు చేయించుకోవాల్సి వస్తోంది. సాధారణ జలుబుకు సైతం చాంతాడంత వైద్యపరీక్షల జాబితా ఇస్తున్నారు. ఎందుకంటే ల్యాబ్‌లు వసూలు చేసే సొమ్ములో

డాక్టర్ల చీటీతో..ల్యాబ్‌ల దోపిడీ

- జ్వరమని వెళ్లినా పరీక్షే
- నాడి పట్టుకోకుండానే చీటి
- టెస్ట్ రిపోర్టు వస్తేనే వైద్యం
- రోగుల జేబులు ఖాళీ
- ఉమ్మడి జిల్లాలో 350 ల్యాబ్‌లు
- అనుమతిలేనివి డబుల్
- వైద్యాధికారులకు మామూళ్లు
- ఎక్కడా కానరాని ధరల పట్టికలు
- తనిఖీలు చేయని వైనం

గరిష్ఠంగా 60శాతం వరకూ వైద్యుల కమిషన్ ఉంటోందని చెబుతున్నారు.ఆర్ఎంపీ తీసుకెళ్తే 30 శాతం వరకూ ముడుతోందట. కార్పొరేట్ ఆస్పత్రుల్లో డాక్టర్లకు టార్గెట్‌లు విధించడంతో విధిలేని పరిస్థితుల్లో కొందరు వైద్యులు వైద్యపరీక్షలు రాస్తున్నారని చెబుతున్నారు.

కానరాని ఫీజు బోర్డులు..

మెడికల్ ల్యాబొరేటరీల్లో ఆయా వైద్య పరీక్షలకు సంబంధించి ధరల పట్టికలు ఉం డాలి. కానీ అధిక శాతం ల్యాబ్‌లలో అవి కనరావు. ఒకవేళ పెడుతున్నా అవి ఎక్కడ ఉన్నాయో వెతుక్కోవాల్సిందే.. లేదంటే చాలా చిన్న అక్షరాలతో ఉంటున్నాయి. రోగులు ధరలపై ప్రశ్నించే అవకాశమే ఉండదు. ఇదే అదునుగా ఇష్టానుసారం ధరలను పిండేస్తు న్నారు. ఒకే రకం టెస్టుకు ఒకల్యాబ్‌కి మరో ల్యాబ్‌కి సంబంధం ఉండడం లేదు. తూర్పుగోదావరిలో 107, కాకినాడ జిల్లాలో 115, కోనసీమ జిల్లాలో మరో వంద వరకూ ల్యాబ్‌లకు ప్రభుత్వ అనుమ తులున్నాయి. అనుమతులు లేనిల్యాబ్‌లు మరో అన్ని ఉంటాయి. దాదాపు అన్ని ల్యాబ్‌లలోనూ ధరల దందా కొనసాగుతూనే ఉంది. ఉదాహరణకు క్యాన్సర్ నిర్ధారణకు తప్పని సరిగా చేసే పెట్ స్కానింగ్‌కి రూ.25 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఇదే స్కానింగ్‌ని తక్కువ ధరకూ చేసే వీలుందని చెబుతున్నారు. ల్యాబ్‌లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో పెద్ద ల్యాబ్‌లు ఎన్నో రకాల రాయితీలను ప్రకటిస్తున్నాయి. 10శాతం నుంచి ఏకంగా 70శాతం వరకూ రాయితీలను ప్రకటిస్తున్నాయంటే ఏ స్థాయిలో దోపిడీ జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. వైద్యులు వ్యాధి నిర్ధారణకు ల్యాబ్‌ల టెస్టులపైనే ఎందుకు పూర్తిగా ఆధారపడిపోతున్నారో అనే ప్రశ్నలకు సహేతుకమైన జవాబు శూన్యమే.



అధికారులకు మామూళ్లు..

ల్యాబ్‌లను నియంత్రించే అధికారం ఉన్న అధికారులు 'ఎందుకనో' తనిఖీల ఊసెత్తడం లేదు. సాధారణంగా ల్యాబ్‌లు ఐదేళ్లకు ఒక సారి లైసెన్సు రెన్యువల్ చేయించుకోవాలి. లైసెన్సు రెన్యువల్‌కి దరఖాస్తు సదరు అధికా రి టేబు ల్‌పైకి వెళ్లినప్పుడు మాత్రమే తనిఖీ కాదు..పరిశీలన చేస్తున్నారు.అది కూడా తూతూ మంత్రంగానే జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. లైసెన్సు ఇచ్చిన తర్వాత ఐదేళ్లపాటు ఆ ల్యాబ్ దరిదాపుల్లోకి అధికారులు వెళ్లకపోవడంతో చాలా ల్యాబ్‌ల్లో సదుపాయాలు, అవసరమైన యంత్ర పరికరాలు ఉండకపోయినా నడిపించేస్తున్నారు. అసలు ల్యాబ్‌లో అందుబాటులో లేని వైద్యపరీక్షలు బోర్డుల్లో దర్శనమిస్తుంటాయి. రోగి వెళ్లిన తర్వాత ఆ వైద్యపరీక్షలకు నమూనాను హైదరాబాద్, పుణె, ఢిల్లీ పంపించాలంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు ప్రారంభం

- ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- సెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉపకులపతి ప్రసాద్

మెయిన్‌లో..

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

- 29 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 5,956 మంది విద్యార్థులు

కాకినాడ రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారంనుంచి ప్రారంభం కానున్నాయని డీఈవో పి.రమేష్ తెలిపారు. ఈనెల 28వరకూ పరీక్షలు కొనసాగుతాయని పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్నిఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 29కేంద్రాల్లో ఉదయం 9.30గంటలనుంచి మధ్యాహ్నం 12.45 గంటలవరకూ జరిగే పరీక్షలకు 5,956మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు.

ఓపెన్‌స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా జరుగుతాయని, జిల్లాలో 4కేంద్రాల్లో 1,151మంది ఇంటర్ విద్యార్థులు, 3పరీక్షాకేంద్రాల్లో 454మంది పదోతరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని సార్వత్రికవిద్య జిల్లా సమన్వయకర్త పి.సాయివెంకటరమణ తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(కాకినాడ),మే18(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. జిల్లా అధికారులు అందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. అర్జీదారులు అర్జీలను వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేయవచ్చునన్నారు.



బదిలీల బెంగ!

- ప్రభుత్వ ఉద్యోగుల్లో కొత్త టెన్షన్
- నేతల సిఫార్సుల లేఖల కోసం క్యూకడుతున్న ఉద్యోగులు

సామర్లకోట, మే 18(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా ఊపింది. దీంతో బదిలీల ప్రక్రియ మొదలుకానుంది. ఉద్యోగులు తాము కోరుకున్న చోటు కోసం నేతల సిఫార్సు లేఖలకోసం క్యూ కడుతున్నారు. వచ్చేనెల 2 వరకు బదిలీల పరంపర ఉండడంతో ఉద్యోగులంతా ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల లేఖల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. తమకు నుకూలమైన ఉద్యోగులను నియమించుకునేందుకు ప్రజాప్రతినిధులు ఇప్పటినుంచే ప్రయత్నాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఐదేళ్లపాటు సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బ దిలీ తప్పనిసరని ప్రభుత్వం బదిలీ ఉత్తర్వు ల్లో పేర్కొంది. దీంతో ఐదేళ్లపాటు సర్వీసు ఒకేచోట పూర్తిచేసుకున్న ఉద్యోగుల్లో తమను ఎక్కడకు బదిలీ చేస్తారోనన్న భయం వెంటాడుతోంది.

రాజకీయ పైరవీలు

అటెండర్‌స్థాయినుంచి జిల్లా మండల, గ్రామస్థాయి అధికారుల వరకు బదిలీలు ఉండనున్నాయి. ఏళ్ల తరబడి ఒకేచోట తిష్ట వేసిన ఉద్యోగులు ఈసారి బదిలీల్లో కదలక తప్పడంలేదు. మండలస్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, ట్రాన్స్‌కోవంటి కీలకశాఖల్లో పనిచేసే ఏఈలు తమకు నచ్చిన చోటు కోసం రాజకీయ పైరవీలు ప్రారంభించారు. ఎవరిని ఎక్కడ నియమిస్తే తమకు పనులు జరుగుతాయో అనే అంశంపై కూడా స్థానిక ప్రజాప్రతినిధులు వారి అనుచరులతో చర్చించి ఉద్యో గులకు సిఫార్సు లేఖలను అందిస్తున్నారని తెలు స్తోంది. ముఖ్యంగా ఉద్యోగుల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి, ఏడాదిలో ఉద్యోగ విరమణ చేసేవారికి బదిలీల్లో మినహాయింపునివ్వడం ఉద్యోగులకు ఊరటనిస్తోంది. ఈసారి జరిగే బదిలీల్లో రాజకీయ ప్రాధాన్యం స్పష్టంగా కనిపిస్తోంది.

జల్లెడ పడుతూ..



- కార్పొరేషన్లు.. మున్సిపాలిటీల్లో పన్ను ఆదాయం పెంపునకు కసరత్తు
- ప్రస్తుతం ఉన్నదాని కంటే 25శాతం పెంచే ఆలోచన
- పన్ను మోసాలు, అక్రమాలు వెలికితీసేలా చర్యలు
- ఇంటింటా సర్వే చేసి నివేదిక అందజేయాలన్న మున్సిపల్ పరిపాలనశాఖ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నగరపాలక సంస్థలు.. మున్సిపాలిటీల్లో పన్ను ఆదాయం పెంపునకు కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా ఆస్తిపన్ను డిమాండ్, వసూళ్లలో మెరుగుదల అవసరమని అందుకు అనుగుణంగా పన్నుల వసూలు ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ పరిపాలనశాఖ సూచించింది. ముందుగా నగరంలో ఇంటింటా సర్వే నిర్వహించి, నివాస గృహాలు ఎన్ని?, వ్యాపార సముదాయాలు ఎన్ని? ఖాళీ స్థలాలు ఎన్ని? వాటికి ప్రస్తుతం వసూలు చేస్తున్న పన్నులు ఎంతెంత? ఇలా అన్ని వివరాలు సేకరించాలని సూచించింది. ఒకనెల వ్యవధిలో ఇంటింటా సర్వే చేసి నివేదికను సమర్పించాలని కమిషనర్లకు సూచించింది. ప్రస్తుత ఏడాది డిమాండ్ కంటే ఆస్తిపన్ను డిమాండ్ కనీసం 25శాతం పెరిగేలా చూడాలని ఆదేశించింది.

పన్నుల డిమాండ్ పెంచేలా సర్వే

కాకినాడ జిల్లాలోని కాకినాడ నగరపాలక సంస్థలో ఇప్పటివరకు ఇక్కడ వసూలు చేస్తున్న పన్నుల డిమాండ్ పెంచేలా మున్సిపల్ అధికారులు సర్వే చేపట్టనున్నారు. చాలా చోట్ల నివాస గృహాలను కమర్షియల్‌గా మార్చి వినియోగిస్తున్నారు. పన్ను మాత్రం రెసిడెన్షియల్ గానే చెల్లిస్తున్నారు. ఈ సారి ఆ పప్పులు ఉడకవు. ఇకపై వేర్వేరుగా చెల్లించేలా నగరపాలక అధికారులు వాటిని సరిచేసే పనిలో పడ్డారు. ఉదాహరణకు వెనుక ఇల్లు, ముందు షాపులు ఉన్న చోట.. ఇంటికి ఒకలా, దుకాణాలకు మరోలా పన్ను వేర్వేరుగా విధించనున్నారు. ఖాళీ స్థలాలకు పన్ను కూడా ప్రస్తుతం ఉన్నదాని కంటే అదనంగా పెరగనుంది. వాస్తవానికి నివాసగృహాని కంటే ఖాళీస్థలాలకు పన్ను ఎక్కువ. ఈ నేపథ్యంలో నగరంలో పట్టణాల్లో పాడుబడి, నిరుపయోగంగా ఉన్న భవనాలను ఇంటి పన్ను నుంచి తొలగించి ఖాళీస్థలంగా వేకెంట్ ల్యాండ్‌టాక్స్‌గా మార్చనున్నారు. ఖాళీ స్థలాల్లో నిర్మాణ చేపట్టి.. పన్నుమాత్రం ఖాళీ స్థలానికే చెల్లిస్తారు. ఇలాంటి వాటికి పన్ను విధించనున్నారు. ఒక అంతస్తు నిర్మాణానికి అనుమతి తీసుకుని, రెండంతస్తుల నిర్మాణం వేసి వినియోగించుకునే వాటిని గుర్తించి అపరాధ రుసుంతోపాటు పన్ను మార్చనున్నారు. ఇలా దాదాపుగా అన్ని మున్సిపాలిటీల్లో మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది జల్లెడ పట్టనున్నారు. ఎక్కడెక్కడ ఏముందో సర్వే చేయనున్నారు.

కాకినాడ నగరపాలక సంస్థలో..

నగరంలోని 50 డివిజన్లలో 92వేల అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇందులో 24వేల వాణిజ్య భవన సముదాయాలు, 7వేలకుపైగా ఖాళీ స్థలాల అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా నగరపాలక సంస్థకు రూ.50కోట్ల ఆదాయం పన్నుల రూపంలో రానుంది. ఇకపై ఈ అసెస్‌మెంట్లు మారనున్నాయి. ప్రస్తుతం సర్వే చేపడితే నగరంలో ఖాళీస్థలాలు, కమర్షియల్ కాంప్లెక్సుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇటీవలకాలంలో నగరంలో వాణిజ్యదుకాణాల సంఖ్య అధికమైంది. ఇళ్లముందు భాగాలను చాలా మంది దుకాణాలుగా మార్చేశారు. నిబంధనలను తుంగలోకి తొక్కి చాలాచోట్ల వాటిని అద్దెకు ఇచ్చి ఆదాయం సంపాదిస్తున్నారు. నగరపాలక సంస్థకు మాత్రం నామమాత్రపు పన్ను చెల్లిస్తున్నారు. చాలాచోట్ల నిర్మాణాలు కూడా అనుమతి తీసుకున్నది ఒకటైతే.. అక్కడ నిర్మించేది మరొకలా ఉంటోంది. ఇకపై అలాంటివి కూడా కాకినాడ నగరపాలక సంస్థ పరధిలో అధికంగా ఉన్నాయి. వాటిని కూడా సర్వే చేయనున్నారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ పరిధిలోని 50 సచివాలయాల్లో ఉ న్న అసెస్‌మెంట్ల నుంచి ఇప్పటివరకు రూ.50.09కోట్ల ఆదాయం లభిస్తుండగా.. ఆ ఆదాయాన్ని రూ.62.62 కోట్లకు పెంచాలి. అంటే ఇప్పుడున్న ఆదాయానికి అదనంగా రూ.12కోట్లు పెంచాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం ఉన్న పన్నులను 25శాతం పెంచేలా చర్యలు చేపడుతున్నారు. కాకినాడ నగరంలోని పలు ప్రాంతాల్లో పన్నులు పెరగనున్నాయి. సుభాష్ రోడ్-3, 35 బీలో డిమాండ్ 269.78లక్షలు ఉంటే.. ప్రస్తుతం ఆ డిమాండ్ 337.22 లక్షలకు పెరగనుంది. డ్రైఫిష్ మార్కెట్ ఏరియాలో రూ.134.95లక్షలకుగాను, రూ.168.69లక్షల పన్ను డిమాండ్ పెంచనున్నారు. సాంబమూర్తినగర్ ఇందిరాకాలనీలో రూ.199.61లక్షలకు రూ.249.51 లక్షలకు పెరగనుంది. పావురాల తూము, పేర్రాజుపేట, బీసీ కాలనీ, వడ్డీలపేట, మార్కెట్ ట్యాంక్ తదితర ఏరియాల్లో పన్నులు అమాంతం పెరగనున్నాయి.

నెలరోజుల్లోపే సర్వే పూర్తి చేయాలి..

కేవలం నెలరోజుల్లో ఈ సర్వే పూర్తిచేయాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన విభాగం నుంచి ఆదేశాలు రావడంతో మున్సిపల్ అధికారులు ఈ సర్వేకోసం ప్రత్యేక బృందాలను ఏ ర్పాటు చేస్తున్నారు. నగరపాలక సంస్థలో ఉన్న అన్నిసచివాలయాల అడ్మిన్లు, రెవెన్యూ విభాగ ఆర్ఐలు, పదిమంది ప్రత్యేకాధికారులు, నోడల్ అధికారుల ఆధ్వర్యంలో ఈ సర్వే జరగనుంది. ఆయా డివిజన్లలో వీరు పర్యటించి అక్కడ ఉన్న నివాస, వాణిజ్య గృహ సముదాయాలను పరిశీలించనున్నారు. వాటి పత్రాలు, పన్ను రశీదులను పరిశీలించి తేడాలుంటే చర్యలు తీసుకోనున్నారు. అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లు ఈ సర్వేను పర్యవేక్షిస్తారు. సర్వే పూర్తయ్యాక కమిషనర్ పునఃపరిశీలిస్తారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు



- కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన

ఫటాఫట్ ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి-కార్పొరేషన్(కాకినాడ)

వేసవిలో తాగునీటి సమస్యకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం కావాల్సిన నిధుల కేటాయించామని నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. కాకినాడలో జరుగుతున్న అభివృద్ధి పనులకు తీసుకుంటున్న చర్యలపై ఆంధ్రజ్యోతి చేసిన ముఖాముఖిలో క్లుప్తంగా ఆమె తెలిపిన సమాధానాలు.

ప్రశ్న: తాగునీటి సమస్యకు తీసుకున్న చర్యలు ఏంటి?

జవాబు: కార్పొరేషన్ పరిధిలో తాగునీటికోసం ఏర్పాటు చేసిన సామర్లకోట, అరట్లకట్ట రిజర్వాయర్లు పూర్తిగా గోదావరి జలాలతో నింపాం. నగర జనాభా 4లక్షలు ఉండగా వీరికోసం రోజుకు 55మిలియన్ లీటర్ల(ఎంఎల్) తాగునీరు అవసరం ఉంటుంది. ప్రస్తుతం 50ఎంఎల్ నీటిని సరఫరా చేస్తున్నాం. వేసవిని దృష్టిలో పెట్టుకుని 130 అదనపు బోర్లు వేయడంతోపాటు 17 చలివేంద్రాలు ఏర్పాటుచేశాం. ట్యాంకర్ల ద్వారా సరపరాకు రూ.1.36కోట్లు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌కి సిద్ధం చేశాం. సామర్లకోట రిజర్వాయర్ కెపాసిటీ 1232 మిలియన్ లీటర్లు కెపాసిటీకి 411 ఎంఎల్ పెద్దాపురంకి, మిలిగిన 821 ఎంఎల్ కాకినాడ శశికాంత్‌నగర్ వాటర్‌వర్క్స్‌కి వాటర్ సరపరా జరుగుతుంది. అరట్లకట్ట రిజర్వాయర్ 1582 ఎంఎల్ కెపాసిటీ కలిగి ఉంది. అక్కడి నుంచి కాకినాడ విక్టోరియా వాటర్‌వర్క్స్‌కి రా వాటర్ సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: పారిశుధ్యంపై నిరంతర పర్యవేక్షణ ఎలా చేస్తున్నారు?

జవాబు: నగరంలో పారిశుధ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి కంపోస్టు యార్డుకు తరలిస్తున్నాం. రోజూ మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేయిస్తున్నాం. వార్డుల్లోను ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. మున్సిపాల్టీల్లో ప్రజలు సహకరించాలి.

ప్రశ్న: పన్నుల వసూళ్లలో ఎన్నోస్థానంలో ఉన్నారు?

జవాబు: పన్నుల వసూళ్లలో కాకినాడ కార్పొరేషన్ రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది. పన్నుల వసూలుకు సచివాలయ సిబ్బందికి రోజువారి లక్ష్యాలను పెట్టాం. వసూళ్లపై దృష్టిసారిస్తున్నాం.

ప్రశ్న: ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన గురించి?

జవాబు: ప్లాస్టిక్ వినియోగం నియంత్రించేందుకు చర్యలు ప్రారంభించాం. ఇప్పటికే నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణాలు, ప్లాస్టిక్ వినియోగిస్తున్న హోటళ్లు, బేకరీలు, ఇతర వ్యాపారులపై దాడులు నిర్వహించి జరిమానాలు వసూలు చేస్తున్నాం.

ప్రశ్న: దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలు?

జవాబు: దోమల నివారణకు సాయంత్రం సమయంలో అన్ని వార్డుల్లోని ప్రధాన వీధుల్లో ఫాగింగ్ చేయిస్తున్నాం. మురుగునీటి కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికలు తొలగిస్తున్నాం. మురుగునీటి నిల్వలు లేకుండా సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.



సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

» నాలుగవ రోజు 1.30 లక్షల మంది పుణ్య స్నానాలు

భూపాలపల్లి, మే18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల సందర్భంగా తెలంగాణలోని కాళేశ్వర క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. పుష్కరాల్లో మొదటి రెండు రోజులు జనం పెద్దగా కనిపించకపోయినా శని, ఆదివారాల్లోనే దాదాపు రెండున్నర లక్షల మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 1.30 లక్షల మందికి పైగా భక్తులు సరస్వతి పుష్కరాల్లో పుణ్యస్నానాలు చేశారు. ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో మహాదేవపూర్ నుంచి కాళేశ్వరం దాకా ట్రాఫిక్ సుమారు 10 గంటల పాటు స్తంభించిపోయింది. దాదాపు 16 కిలోమీటర్ల మేర ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోవడంతో పుష్కరాలకు వచ్చిన భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు.

హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

సిరాజ్-ఉర్-రెహ్మాన్ అరెస్టయ్యారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.

ఏం జరిగింది?: విజయనగరం జిల్లా కేంద్రంలోని అంబటి సత్రానికి చెందిన సిరాజ్-ఉర్-రెహ్మాన్ బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసి అక్కడే ఉగ్రవాద కార్యకలాపాలపై ఆసక్తి పెంచుకున్నాడు. ఆ తర్వాత విదేశీ ఉగ్రవాద సంస్థ ఐఎస్‌తో పరిచయం ఏర్పడింది. ఆ సంస్థ సూచనలతో పేలుళ్లతో విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. పేలుళ్లకు వినియోగించే అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్‌లను ఆన్‌లైన్‌లో సంపాదించాడు. దీనిపై ఏపీ, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు సమాచారం అందింది. అంతేకాకుండా గతంలో సిరాజ్ సామాజిక మాధ్యమంలో పాకిస్థాన్ అనుకూలంగా పోస్టులు పెట్టినట్టు గుర్తించారు. మరోవైపు, హైదరాబాద్‌కు చెందిన సయ్యాద్ సమీర్‌తో రహ్మాన్‌కు ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. సమీర్ కూడా ఉగ్రసానుభూతి పరుడిగా మారినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో సమీర్‌ను హైదారాబాద్‌లో అదుపులోకి తీసుకుని విజయనగరం తీసుకొచ్చారు. ఏపీ, తెలంగాణ పోలీసులతో పాటు, జిల్లా పోలీస్ అధికారులు ఇద్దరినీ పూర్తి స్థాయిలో విచారించారు. ఇద్దరిపైనా ఉగ్రవాద సానుభూతి చర్యలు, పేలుళ్లకు కుట్ర, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి జడ్జి ముందు ప్రవేశ పెట్టారు. న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. కాగా.. సిరాజ్ తండ్రి, సోదరుడు ఏపీ పోలీస్ శాఖలో పని చేస్తున్నారు.

యూట్యూబ్‌లో చూసి..: సౌదీ అరేబియాలోని ఐఎస్ ఉగ్రవాదుల(హ్యాండర్లు) నుంచి బాంబుల తయారీకి ఆదేశాలు వచ్చినట్లు ఇరురాష్ట్రాల నిఘావర్గాలు గుర్తించాయి. ఈ క్రమంలో బాంబులు ఎలా తయారు చేయాలనే విషయాన్ని యూట్యూబ్‌లో వెతుకులాడినట్టు అధికారులు గుర్తించారు. అనంతరం, హైదరాబాద్‌లో బాంబులను తయారు చేశారని నిర్ధారించారు. ఈ బాంబులను పరీక్షించేందుకు కొన్ని ప్రదేశాలను వీరు ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అసలు హైదరాబాద్‌లో వీరి టార్గెట్ ఏమిటి? ఎక్కడ పేలుళ్లకు కుట్రలు పన్నారు? ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఎవరెవరు సహకరిస్తున్నారు? అనే కోణాల్లో వీరిని విచారించనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

గురితప్పిన ఇస్రో బాణం

(మొదటి పేజీ తరువాయి)

ఉపగ్రహాన్ని తీసుకుని భారీ అంచనాలతో నింగిలోకి ఎగిరిన పీఎస్ఎల్వీ-సీ61 సాంకేతిక సమస్య కారణంగా లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. నింగిలోకి దూసుకెళ్లిన కాసేపటికే మూడో దశలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రాకెట్ ప్రయాణ గమన దిశ మారింది. సాంకేతిక సమస్యను గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ దిశను మార్చి నిర్దేశిత మార్గంలోకి తీసుకొచ్చేలా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఈ మిషన్‌ను అర్ధంతరంగా ముగించాల్సి వచ్చింది. ప్రామాణిక భద్రత ప్రొటోకాల్‌ను అనుసరించి సాంకేతిక సమస్యను గుర్తించిన తర్వాత రాకెట్‌లోని నాలుగో దశ, పేలోడ్ (ఈవోఎస్-09)లను కూల్చివేశారు. అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ మాట్లాడుతూ.. ప్రయోగం పూర్తి కాలేదని.. రెండు దశలను విజయవంతంగా పూర్తి చేసుకొన్న రాకెట్‌కు మూడో దశలో సాంకేతిక సమస్య వచ్చిందని వెల్లడించారు. దీంతో... సరిహద్దులపై నిఘా కోసం ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు భారత్ చేసిన ప్రయత్నం తాత్కాలికంగా నిలిచిపోయింది.

పీఎస్ఎల్వీకి మూడో పరాజయం

అంతకుముందు శనివారం ఉదయం 7:59 గంటలకు ప్రారంభమైన 22 గంటల కౌంట్‌డౌన్ పూర్తవగానే ఆదివారం ఉదయం 5:59 నిమిషాలకు షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి పయనమైంది. 8 నిమిషాలకు తన రెండు దశలను సునాయసనంగా పూర్తి చేసుకొంది. మూడో దశలోకి ప్రవేశించగానే సాంకేతిక సమస్య తలెత్తింది. ఘన హైడ్రాక్సిల్-టెర్మినేటెడ్ పాలిబ్యూటాడిన్ (హెచ్‌టీపీబీ) మోటారుతో నడిచే మూడో దశ (పీఎస్3) సరిగ్గా పనిచేయలేదు. దీంతో రాకెట్ గతి తప్పింది. పీఎస్3 దశకు సంబంధించిన డేటా, తయారీ రికార్డులను పరిశీలించేందుకు ఇస్రో ఒక వైఫల్య విశ్లేషణ కమిటీని ఏర్పాటు చేసింది. పీఎస్ఎల్వీ శ్రేణిలో ఇస్రో ఇప్పటివరకూ 63 ప్రయోగాలు చేపట్టగా.. ఇది మూడో వైఫల్యమేనని, 2017 తర్వాత పీఎస్ఎల్వీ రాకెట్ విఫలమవడం ఇదే తొలిసారని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు.



ఇస్రో జైత్రయాత్రకు బ్రేక్

ఎనిమిదేళ్లుగా 58 విజయాలతో ఇస్రో విజయ పరంపర కొనసాగిస్తోంది. 2017 నుంచి ఈ ఏడాది జనవరి 29 వరకు... పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీ, గగన్‌యాన్-డీ1, ఆర్ఎల్‌వీ-టీడీ ఇలా వరుసగా 58 ప్రయోగాల్లో విజయం సాధించింది. ఈ సక్సెస్‌తో భారత్ అంతరిక్ష పరిశోధనల్లో అగ్రరాజ్యాల సరసన నిలిచింది. ఇందులో చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1, గగన్‌యాన్-డీ1 వంటి ప్రయోగాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు దేశ రక్షణ, సైనిక అవసరాలు, సరిహద్దుల్లో నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడం కోసం ఈవోఎస్-09ను పంపేందుకు ఆదివారం ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ విఫలమవడంతో వరస విజయాలకు బ్రేక్ పడింది.

60 విజయాలు.. 3 వైఫల్యాలు

1969 ఆగస్టు 15న ప్రారంభమైన ఇస్రో.. 1993లో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలకు ఇస్రో శ్రీకారం చుట్టింది. పీఎస్ఎల్వీ-డీ1 పేరిట 1993 సెప్టెంబరు 20న తొలి ప్రయోగం చేపట్టగా.. నాలుగో దశలో ద్రవ ఇంధనంలో సాంకేతిక లోపం తలెత్తి అది విఫలమైంది. అనంతరం 1994 అక్టోబరు 15న పీఎస్ఎల్వీ-డీ2 ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. అక్కడి నుంచి ఇస్రో వరుసగా 39 విజయాలు సాధించింది. 2017 ఆగస్టు 31న పీఎస్ఎల్వీ-సీ39 రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఈ వైఫల్యం తర్వాత 8 ఏళ్లలో పీఎస్ఎల్వీ ద్వారా చేపట్టిన 21 రాకెట్ ప్రయోగాలు వరుసగా విజయం సాధించాయి. తాజాగా పీఎస్ఎల్వీ-సీ61 మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగం విఫలమైంది.

ఉక్రెయిన్‌పై 273 డ్రోన్లతో దాడి

కీవ్, మే 18: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీ స్థాయిలో 273 డ్రోన్లతో దాడులకు తెగబడింది. డ్రోన్లతో ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు చేసింది. ఈ దాడుల వల్ల ఒక మహిళ మృతి చెందగా.. మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. 2022లో పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ స్థాయిలో భారీ డ్రోన్ దాడి జరగలేదని తెలుస్తోంది. కాల్పుల విరమణ దిశగా మాస్కో, కీవ్ మధ్య మొదటిసారి ఇస్తాంబుల్ వేదికగా జరిగిన ముఖాముఖి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలపై డ్రోన్లను ప్రయోగించింది. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్‌లో రక్తపాతానికి ముగింపు పలకడానికి గాను సోమవారం రష్యా అధ్యక్షుడు పుతిన్, తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 103 మంది మృతి

గాజా, మే 18: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేసింది. గాజా స్ట్రిప్ వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జరిపిన వైమానిక దాడుల్లో 103 మంది మరణించారు. ఉత్తర గాజాలోని ప్రధాన ఆస్పత్రిని సైతం మూసివేశారు. ఇజ్రాయెల్ సూచించిన షరతుల మేరకు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ ఒప్పుకొనేలా ఒత్తిడి పెంచే ప్రణాళికలో భాగమే తాజా భీకర దాడులు. ఖాన్‌యూనిస్ నగరంలోనూ, దాని చుట్టుపక్కల జరిపిన దాడుల్లో ఇళ్లు, పునరావాస టెంట్‌లు ధ్వంసమవడంతో 48 మందికిపైగా మరణించారు. మృతుల్లో 18 మంది చిన్నారులు, 13 మంది మహిళలు ఉన్నారని నస్సెర్ ఆస్పత్రి అధికార ప్రతినిధి వీం ఫేర్స్ చెప్పారు. ఉత్తర గాజాలోని ఇండోనేసియన్ ఆస్పత్రి చుట్టూ దాడులు జరగడంతో ఆస్పత్రిని మూసివేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉత్తర గాజాలో క్షతగాత్రులకు వైద్యసేవలు అందిస్తున్న ప్రధాన ఆస్పత్రి ఇదే. తాజాగా హౌతీ రెబెల్స్ ఇజ్రాయెల్‌పై దాడులు ప్రారంభించారు. దీంతో ఆదివారం ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో సైరన్‌ల మోత మోగింది.

కాల్పుల విరమణకు ముగింపు తేదీ లేదు: భారత్

న్యూఢిల్లీ, మే 18: భారత్, పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవోఎస్) మధ్య ఆదివారం ఎలాంటి చర్చలూ జరగలేదని భారత సైన్యం స్పష్టం చేసింది. అలాగే ఈ నెల 11న ఇరు దేశాలు తీసుకున్న కాల్పుల విరమణ నిర్ణయానికి 'ముగింపు తేదీ ఏమీ లేదు' అని వెల్లడించింది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ నిర్ణయం ఈ నెల 18తో ముగుస్తుందని మీడియాలో కథనాలు వస్తున్న నేపథ్యంలో భారత సైన్యం దీనిపై స్పష్టతనిచ్చింది. మరోవైపు, 'ఆపరేషన్ సిందూర్' ప్రతీకార చర్య కాదని.. పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు చేసిన న్యాయమని భారత సైన్యం స్పష్టం చేసింది. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులకు ఎలా ప్రణాళిక రచించింది, సైనికులకు ఏ విధంగా శిక్షణ ఇచ్చింది, ఈ ప్రణాళికను ఎలా అమలు చేసింది.. అనే విషయాలు తెలియజేస్తూ 'ప్లాన్డ్.. ట్రెయిన్డ్.. ఎగ్జిక్యూటెడ్..' పేరుతో ఆర్మీ ఆదివారం ఓ వీడియోను షేర్ చేసింది.

ఆకాశ్ పనితీరు చూడ్డానికి..కలాం ఉంటే బాగుండేది!

» 'ఆంధ్రజ్యోతి'తో డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్త,ఆకాశ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రహ్లాదరామారావు



అల్వాల్, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా పాక్ మన దేశంపైకి ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను తుత్తునియలు చేసిన ఆకాశ్ క్షిపణుల తయారీ అబ్దుల్ కలాం కలల ప్రాజెక్టు అని.. దానికి ఆయన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని డీఆర్‌డీవో రిటైర్డ్ శాస్త్రవేత్త, కర్ణాటకకు చెందిన డాక్టర్ ప్రహ్లాదరామారావు పేర్కొన్నారు. ఆకాశ్ పనితీరు చూడటానికి ఆయన ఇక్కడ ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. రక్షణ రంగంలో కీలకమైన ప్రాజెక్టులన్నింటికీ కేంద్రస్థానంగా మారిన హైదరాబాద్ డీఆర్‌డీవోలో అభివృద్ధి చేసిన అనేక రక్షణ ఉత్పత్తులు యుద్ధరంగంలో కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం.. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు నాయకత్వం వహిస్తున్నప్పుడు రామారావుకు ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇక్కడ అత్యంత కీలకమైన బాధ్యత అప్పగించారు. అలా తాము అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణులు దాయాది దేశ క్షిపణులను విజయవంతంగా తిప్పికొట్టడం ఆనందం కలిగించిందని.. అది తన జీవితంలోనే అత్యంత సంతృప్తికరమైన రోజని ప్రహ్లాదరామారావు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. ఆకాశ్ క్షిపణిని అభివృద్ధి చేసే క్రమంలో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ.. కలాం మద్దతుతో ప్రాజెక్టును కొనసాగించామని తెలిపారు.

ఘనంగా నూతన పోప్ ప్రమాణ స్వీకారం



వాటికన్ సిటీ, మార్చి 18: నూతన పోప్ లియో-16 ప్రమాణ స్వీకారం ఆదివారం ఇక్కడ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో జరిగిన ప్రారంభ ప్రార్థనకు దాదాపు 2 లక్షల మంది హాజరయ్యారు. వారసత్వంగా వస్తున్న గొర్రెపిల్ల ఉన్నితో చేసిన శాలువాను భుజాలపై వేసినప్పుడు, 'మత్స్యకారుని ఉంగరాన్ని' వేలికి తొడిగినప్పుడు ఆయన ఉద్వేగానికి గురయ్యారు. ఉంగరాన్ని తొడిగిన అనంతరం చేతులను చూసుకొని దండాన్ని ధరించారు. తరువాత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవానికి భారత ప్రభుత్వ ప్రతినిధిగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ హాజరయ్యారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

గ్యాంగ్‌స్టర్ పాత్రలో కమల్

కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'థగ్ లైఫ్'. శ్రీయ కథానాయికగా, శింబు కీలక పాత్రలో నటించారు. రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. కమల్ హాసన్ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో అదరగొట్టారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించారు. తెలుగులో ఈ సినిమాను ఎన్.సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు.



ఆలయ రక్షణ కోసం..



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'భైరవం'. డా.జయంతి లాల్ గడా సమర్పణలో కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈనెల 30న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. గ్రామంలోని వారాహి ఆలయం చుట్టూ కథ తిరుగుతుంది. రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆలయం భూములపై కన్నేస్తాడు. దాంతో గ్రామంలో శాంతికి భంగం కలుగుతుంది. ఈ క్రమంలో ముగ్గురు స్నేహితులు కలసి ఆలయాన్ని, దాని వారసత్వాన్ని రక్షించేందుకు బలంగా నిలబడతారు. వారి మధ్య ఉన్న బంధం, ధైర్యం గ్రామ ప్రజల్లో ఆశలు చిగురింపజేస్తాయి. ట్రైలర్‌ని బట్టి చూస్తే కమర్షియల్ వాల్యూస్‌తో ఉన్న కథను దర్శకుడు చాలా ప్రభావశీలంగా తెరపై ఆవిష్కరించారనిపిస్తోంది.

కొత్తదనంతో నిండిన చిత్రం



నవీన్ చంద్ర హీరోగా రాకేశ్ పొట్టా తెరకెక్కిస్తున్న చిత్రం 'కరాలి'. మందలపు శివకృష్ణ నిర్మిస్తున్నారు. రాశీ సింగ్, కాజల్ చౌదరి హీరోయిన్లు. ఆదివారం ఈ సినిమాను ప్రారంభించారు. నిర్మాత సాహు గారపాటి క్లాప్ కొట్టి స్క్రిప్టును అందజేశారు. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ "నేనింతవరకూ ఇటువంటి యాక్షన్ డ్రామా చేయలేదు. కొత్తదనంతో నిండిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజారవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

హారర్ థ్రిల్లర్ అమరావతికి ఆహ్వానం



శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణ, సుప్రీత, హరీశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న హారర్, థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం' షూటింగ్ పూర్తయింది. ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం కోసం ఇటీవల 20 రోజుల పాటు మధ్యప్రదేశ్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. జీవీకె దర్శకత్వంలో కె.ఎస్.శంకరరావు, ఆర్.వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు శివ కంఠంనేని మాట్లాడుతూ 'ప్రజెంట్ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శకుడు జీవీకే ఓ మంచి హారర్, థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. టెక్నికల్‌గా కూడా చిత్రం బాగుంటుంది' అని తెలిపారు. సరికొత్త కథాంశంతో వస్తున్న సినిమా ఇదనీ, ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుందనీ దర్శకుడు చెప్పారు.

నా కెరీర్‌లోనే ప్రత్యేకం

- సుమయ రెడ్డి



'డియర్ ఉమ' సినిమాతో తెరంగేట్రం చేశారు తెలుగమ్మాయి సుమయ రెడ్డి. ఈ సినిమాకు ఆమె నిర్మాతగానూ వ్యవహరించడం విశేషం. ఇందులో ఆమె పోషించిన డాక్టర్ పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నా కెరీర్‌లో 'డియర్ ఉమ' ఎంతో ప్రత్యేకమైంది. నటిగా నాకు మంచి బ్రేక్‌తో పాటు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ప్రేక్షకులు అందించిన ఆదరాభిమానాలు మరువలేనివి. ఈ ప్రోత్సాహంతో మరింత ముందుకు సాగుతాను' అని చెప్పారు. త్వరలోనే ఆమె నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ ప్రకటించనున్నారు.

జూన్ నుంచి థియేటర్లు బంద్



తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్ కానున్నాయి. అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించలేమని, థియేటర్లు మూసివేయాలని సినీ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. పర్సంటేజ్ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని తేల్చి చెప్పారు. ఆదివారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో తెలంగాణ, ఆంధ్రా సినీ ఎగ్జిబిటర్ల సమావేశం నిర్వహించారు. నిర్మాతలు దిల్‌రాజు, సురేశ్‌బాబు సహా 60 మంది ఎగ్జిబిటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య చాలా కాలంగా పర్సంటేజీలపై చర్చ సాగుతోంది. రెంటల్ విధానంలో సినిమాలు ప్రదర్శించడం సాధ్యం కాదని ఎగ్జిబిటర్లు వాదిస్తుంటే, పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు సైతం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిటర్ల సమావేశంలో పర్సంటేజీలు, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. పర్సంటేజీల రూపంలో చెల్లిస్తేనే సినిమాలను ప్రదర్శిస్తామని నిర్మాతలకు లేఖ రాయాలని తీర్మానించారు.

ఈ సినిమాలపై ప్రభావం

జూన్ 1 నుంచి థియేటర్లు మూసివేయాలనే ఎగ్జిబిటర్ల నిర్ణయంతో పలు సినిమాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. ఈ నెలాఖరు నుంచి వరుసగా పెద్ద సినిమాలు రిలీజ్ కానున్నాయి. మే 30న భైరవం, జూన్ 5న థగ్ లైఫ్, జూన్ 12 హరిహర వీరమల్లు, జూన్ 27న కన్నప్ప, జూన్ 20న కుబేర, జూలైలో కింగ్‌డమ్ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి.



పంటను పశువులు, పక్షుల నుంచి రక్షించుకునేందుకు ఓ రైతుకు తట్టిన ఆలోచనే ఈ ఫొటో. కాకినాడ జిల్లా తుని మండలం మరువాడలో కూరగాయల పంటకు పాత చీరలను కట్టాడు. ఇది చూసిన పలువురు పాత చీరలను కొత్తగా ఉపయోగించడం బాగుందని కితాబునిస్తున్నారు.

చీరలు కట్టే..రక్షణ పెట్టే

- ఫొటోగ్రాఫర్, కాకినాడ

పాపికొండలకు పోదాం..

తరలివచ్చిన 600 వందల మంది పర్యాటకులు



పాపికొండలకు గోదావరిలో పర్యాటకులతో వెళ్తున్న బోట్లు

దేవీపట్నం/వీఆర్‌పురం, మే 18 (ఆంధ్రజ్యోతి): పాపికొండల అందాలు తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు తరలివచ్చారు. ఆదివారం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి 600 వందల మంది పర్యాటకులు 13 బోట్లలో పోశమ్మ గండి వద్ద ఉన్న బోట్ పాయింట్ నుంచి బయలుదేరి వెళ్లారు. పూడిపల్లి, దేవీపట్నం, తొయ్యేరు అగ్రహారం, మూలపాడు, మడిపల్లి మంటూరు, నడిపూడి, కచ్చులూరు, తాళ్లూరు కొండ మొదలు గ్రామాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లారు. ముందుగా మాతృశ్రీ గండి పోశమ్మను దర్శించుకున్నారు. అనంతరం ప్రకృతి అందాలను ఆస్వాదించారు. గోదావరిలో వెళ్తూ ఎంతో ఆనందంగా గడిపారు.

రిటైర్డు ఎయిర్‌ఫోర్స్ అధికారి స్థలం కబ్జాపై

ఇంటెలిజెన్స్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాకినాడ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం 49వ డివిజన్ గైగోలుపాడులో రిటైర్డు ఎయిర్‌ఫోర్స్ అధికారి కొత్తపల్లి వెంకటరామానాయుడు-సత్యవతి దంపతులకు చెందిన సర్వే నెం.194/4లో 700 గజాల స్థలం కబ్జాపై ఇంటెలిజెన్స్ విభాగం ఆరా తీసింది. రిటైర్డు ఎయిర్‌ఫోర్స్ అధికారి స్థలం కబ్జాపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ సమస్యపై సమగ్ర వివరాలు సేకరించి నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఆదేశించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు స్థలం కబ్జాకు పాల్పడిన వైసీపీ నాయకులపై ఇంటెలిజెన్స్ అధికారులు ప్రాథమిక విచారణ చేపట్టి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నారు.

మట్టి తవ్వకాల అడ్డగింత

పిఠాపురం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెంలోని పాపిడిదొడ్డి చెరువులో మట్టి తవ్వకాలకు మరోమారు ప్రయత్నించడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఎఫ్‌కే పాలెం, విరవాడ గ్రామాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువులో మట్టి తవ్వకాలకు విరవాడకు చెందిన మహిళా రైతు పేరుపై అనుమతులు మంజూరయ్యాయి. వీరు కొద్ది రోజులుగా మట్టి తవ్వకాలకు ప్రయత్నిస్తుండగా ఎఫ్‌కే పాలెం గ్రామస్తులు, రైతులు, ఉపాధి కూలీలు అడ్డుకుంటున్నారు. వీరి ఆందోళనలను మట్టి తవ్వకందారులు పట్టించుకోకుండా మరోసారి ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలను ప్రారంభించారు. దీంతో సీపీఎం జిల్లా నాయకుడు దువ్వా శేషుబాబ్జీ ఆధ్వర్యంలో నాయకులు కోనేటి రాజు, కుంచే చిన్నా, ఎఫ్‌కేపాలెం గ్రామస్తులు అడ్డుకున్నారు. మట్టి తవ్వకందారులతో పాటు విరవాడ రైతులు అక్కడకు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. తహశీల్దార్ వీవీ గోపాలకృష్ణ, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ జానీబాషా ఇరువర్గాలతో చర్చలు జరిపారు. పాడా పీడీ చైత్రవర్షిణి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు వారితో చర్చలు జరిపారు. తవ్వకాలకు ఒప్పుకునేది లేదని గ్రామస్తులు, రైతులు తేల్చి చెప్పారు.



తవ్వకాలను అడ్డుకుంటున్న దృశ్యం

తప్పిన పెను ప్రమాదం

కోనసీమ జిల్లా నగరం జీసీఎస్ వద్ద జనరేటర్‌లో మంటలు

అదుపుచేసిన ఓఎన్జీసీ సిబ్బంది, ఊపిరి పీల్చుకున్న స్థానికులు



నగరంలోని జీసీఎస్‌లో మంటలు



మంటలను అదుపు చేస్తున్న ఓఎన్జీసీ సిబ్బంది

మామిడికుదురు, మే 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని ఓఎన్జీసీ జీసీఎస్‌లోని జనరేటర్‌లో ఆదివారం సాయంత్రం మంటలు ఏర్పడ్డాయి. అధిక ఉష్ణోగ్రత వల్ల మంటలు ఏర్పడడంతో సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి అదుపు చేశారు. జనరేటర్‌లోని మంటలతో పాటు పక్కనే ఉన్న ఎండుగడ్డి అంటుకోవడంతో స్థానికులు భయాందోళన చెందారు. ఓఎన్జీసీకి చెందిన ఫైర్ ఇంజన్లు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేయడంతో పెను ప్రమాదం తప్పింది. జీసీఎస్‌కు నిత్యం సుమారు 13 బావుల నుంచి ముడి చమురు, సహజ వాయువు సరఫరా అవుతోంది. జనరేటర్‌లో మంటలు చెలరేగడంతో ఆయా బావుల్లోని కొన్నింటిని నుంచి ఉత్పత్తిని నిలిపేశారు. జనరేటర్‌లో మంటలు ఏర్పడ్డాయా లేదా పైపులైను లీకై మంటలు ఏర్పడ్డాయాఅని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పిందని ఊపిరిపీల్చుకున్నారు.

అయినవిల్లి సిద్ధి వినాయకునికి

రూ.30లక్షల విలువైన బంగారు పాదుకలు

అయినవిల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామికి రూ.30లక్షల విలువైన బంగారు పాదుకలను ఆదివారం బహూకరించారు. కొత్తపేట మాజీ ఎమ్మెల్యే మంతెన సుబ్బరాజు వంశవారసులు... వెంకటకృష్ణరాజు- దుర్గావతి దంపతులు, వారి కుమారులు వెంకటసూర్యసుబ్బరాజు-శ్వేత దంపతులు 369 గ్రాములు బంగారు శఠారి (పాదుకలు)ని సమర్పించారు. అర్చకులు వాటికి సంప్రోక్షణ నిర్వహించారు. దాతను శేష వస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనం అందజేశారు. ఈవో ముదునూరి సత్యనారాయణరాజు దాతను అభినందించి స్వామివారి చిత్రపటం బహూకరించారు.



దాతకు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న ఈవో



వినాయకునికి సమర్పించిన పాదుకలు

'లోవ'కు పోటెత్తిన భక్తులు

ఆలయానికి రూ.4.33 లక్షల ఆదాయం





ఆలయంలో తలుపులమ్మ, వంట చేసుకుంటున్న భక్తులు

తుని రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేలాదిగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాల్లో వంట వార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. రూ.4.33లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో విశ్వనాధరాజు తెలిపారు.

ఇంటిని అన్యాయంగా కూల్చేశారు

పిఠాపురంలో మహిళ ఆవేదన

పిఠాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు జారీ చేసిన పట్టా ఉన్నప్పటికి ఆ స్థలంలో తాను కట్టుకున్న ఇంటిని అధికారులు అన్యాయంగా కూల్చివేశారని కాకినాడ జిల్లా పిఠాపురం ఇందిరానగర్‌కు చెందిన మిరియాల సూర్యకుమారి ఆవేదన వ్యక్తం చేసింది. తనకు 2011లో అప్పటి తహశీల్దారు నివేశన స్థల ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారని ఆమె ఆదివారం సాయంత్రం విలేకర్లకు తెలిపింది. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తన ఇంటిని అధికారులు కూల్చివేశారని, ఇప్పుడు పిల్లలతో తాను ఎక్కడికి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేసింది. తమ కుటుంబాన్ని డిప్యూటీ సీఎం పవన్ ఆదుకుని న్యాయం చేయాలని కోరుతోంది.



పిఠాపురంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న మిరియాల సూర్యకుమారి

లారీ ఢీకొని ఐదుగురికి గాయాలు

కొవ్వూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఐదుగురు గాయపడినట్టు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ తెలిపారు. జంగారెడ్డిగూడెనికి చెందిన మదంపాటి గణేష్‌కుమార్ ఈనెల 15న తన కుమార్తెలిద్దరితో పాట బావమరిది పిల్లలిద్దరిని మోటార్‌సైకిల్ ఎక్కించుకుని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం బయలుదేరాడు. కొవ్వూరు గామన్‌బ్రిడ్జిపై 6వ స్తంభం వద్ద ఎదురుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును క్రాస్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గణేష్‌కుమార్‌తో పాటు నలుగురు పిల్లలకు గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు గణేష్‌కుమార్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు సత్యనారాయణ తెలిపారు.

కారు, మోటార్‌సైకిల్ ఎదురెదురుగా ఢీ

ఇద్దరికి గాయాలు



గాయపడిన ఓ వ్యక్తి

సామర్లకోట, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారు కోదండరామపురం మలుపు వద్ద ఆదివారం కారు, మోటార్‌సైకిల్ పరస్పరం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో మోటార్‌సైకిల్ నడుపుతున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సామర్లకోట నుంచి పిఠాపురం వెళ్తున్న పిఠాపురానికి చెందిన ఇద్దరు సామర్లకోటలో పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా కోదండరామపురం మలుపు వద్దకు వచ్చేసరికి పిఠాపురం నుంచి సామర్లకోట వైపునకు వస్తున్న కారు అతివేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైస్కూల్‌లో కంప్యూటర్లు, ప్రింటర్లు చోరీ



శంఖవరంలో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం, పోలీసులు

శంఖవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం హైస్కూల్‌లో కంప్యూటర్లు, ప్రింటర్లను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. ఈమేరకు హెచ్ఎం భాస్కరలక్ష్మీ అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం మధ్యాహ్నం వరకూ పదోతరగతి విద్యార్థులకు మెమొలు, హాల్‌టికెట్లు అందజేశామని.. ఆదివారం ఉదయం 9 గంటలకు వచ్చి చూసేసరికి ఆఫీసు గది తాళాలు బద్దలుగొట్టి ఉండటం గమనించినట్టు తెలిపారు. ఆఫీసు రూములో 2 కంప్యూటర్లు, 2 ప్రింటర్లు లేవని, మంచినీటి ప్యూరిఫికేషను కోసం తీసుకొచ్చిన రిపేరు సామాన్లు కూడా చోరీకి గురయ్యాయని పేర్కొన్నారు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు క్లూస్ టీం సభ్యులతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహిస్తామని తెలిపారు.

మద్యంతో వ్యక్తి అరెస్ట్

కొవ్వూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామంలో కిరాణా దుకాణంలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో రూరల్ పోలీసులు దాడి చేశారు. మద్యం విక్రయిస్తున్న కేతాడ గోపిని అరెస్టు చేసి అతడి నుంచి 6 క్వార్టర్ మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

21న జిల్లా విద్యా శాఖ కార్యాలయాల ముట్టడి

ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక తీర్మానం



సమావేశంలో ఐక్యత చాటుతున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

కాకినాడ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న జిల్లా విద్యాశాఖ కార్యాలయాలను ముట్టడించాలని కాకినాడ ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక సమావేశంలో తీర్మానించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పలు విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం ఐక్య వేదిక పిలుపు మేరకు తలపెట్టిన ముట్టడి కార్యక్రమానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల సభ్యులు 9 మందితో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ బదిలీల్లో పోస్టులను బ్లాక్ చేయకూడదని, విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రాథమిక పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులుండాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతర మీడియం ఉండాలని, ఉన్నత పాఠశాలల్లో సెక్షన్‌కు 45మంది దాటితే మాత్రమే రెండో సెక్షన్ ఉండాలి వంటి ప్రధానమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని విద్యా శాఖ కార్యాలయాల ముట్టడిని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

మానసిక స్థితి సక్రమంగా లేని బాలికపై

పలుమార్లు వృద్ధుడి అత్యాచారం

- గర్భవతిని చేసిన వైనం
- తల్లి ఫిర్యాదుతో నిందితుడి అరెస్ట్

ముమ్మిడివరం, మే 18 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని 15 ఏళ్ల బాలికకు 61 ఏళ్ల వృద్ధుడు మాయమాటలు చెప్పి పలుమార్లు అత్యాచారంచేసి గర్భవతిని చేసిన ఉదంతమిది. దీనికి సంబంధించి ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలా సాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలంలో ఓ గ్రామానికి చెందిన ముడే బాలయోగి అలియాస్ బాలయ్య (61) భార్య మృతిచెందడంతో ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. బాలయోగి ఒక్కడే తన ఇంట్లో నివసిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మహిళ భర్త మృతిచెందడంతో ఇద్దరు కుమార్తెలతో ఇంట్లో ఉంటుంది. చిన్న కుమార్తెకు మానసిక స్థితి సక్రమంగా లేక పదో తరగతి చదివి ఇంట్లోనే ఉంటుంది. ఆ బాలికపై కన్నేసిన బాలయోగి మాయమాటలు చెప్పి మోటారుసైకిల్‌పై తిప్పుతూ నాలుగైదు నెలలుగా పలు సార్లు అత్యాచారం చేశాడు. ఆ బాలిక ఆరోగ్యంలోను, శారీరకంగా మార్పులు రావడాన్ని గమనించిన తల్లి స్థానిక వైద్యులను సంప్రదించి అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించగా బాలిక నాలుగు నెలల గర్భవతిగా నిర్ధారించారు. దీంతో ఆ బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేశారు.నిందితుడు బాలయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భార్యపై భర్త కత్తితో దాడి

అడిగిన వెంటనే

సొమ్ములివ్వలేదని ఆగ్రహం

గొల్లప్రోలు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): తాకట్టులో ఉన్న ఫోన్ విడిపించుకునేందుకు తాను అడిగిన వెంటనే డబ్బులు ఇవ్వలేదనే కోపంతో భార్యపై భర్త కత్తితో దాడి చేశాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు పాత బ్యాంకు వీధికి చెందిన కిలాడి జ్యోతి చింతపండు వలిచే పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. భర్త శ్రీను వ్యవసాయ పనులు చేస్తున్నా మద్యానికి బానిస కావడంతో ఇంటి వద్ద డబ్బులు ఇవ్వట్లేదు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. శ్రీను తండ్రి తనకున్న 1.50 ఎకరాల భూమిని మనుమడు కిలాడి శివరాం పేరుపై రాశాడు. అప్పటి నుంచీ కక్ష పెంచుకుని శ్రీను భార్య, పిల్లలను వేధిస్తున్నాడు. తాను సెల్‌ఫోన్ తాకట్టు పెట్టానని, విడిపించేందుకు రూ.2వేలు ఇవ్వాలని అడిగాడు. డబ్బులు లేవని చెప్పడంతో భార్య జ్యోతిపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మరణించిన వ్యక్తి

తుని రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నరసింగపల్లి- బయ్యవరం రైల్వేస్టేషన్ మధ్యలో తుని వైపు వెళ్లే రైలు నుంచి ప్రయాణం చేస్తూ సుమారు 30 ఏళ్ల వ్యక్తి జారి పడి మృతిచెందినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మరణించిన వ్యక్తి వివరాలు కానరాలేదని, బంధువులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచినట్టు రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన ఆదియ్య

ఉండ్రాజవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం చివటం గ్రామపరిధిలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన మట్టపర్తి ఆదియ్య (40) తాడేపల్లిగూడెం నుంచి తణుకు వైపు మోటారుసైకిల్‌పై వస్తుండగా స్థానిక కమ్మకల్యాణమండపం ఎదురుగా జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఆదియ్య తలకు తీవ్రమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ జి.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలుడు..



ప్రణీత్ (ఫైల్)

యానాం, మే 18 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ బాలుడు చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వేసవి సెలవుల నేపథ్యంలో యానాం కనకాలపేట గ్రామంలో తన అమ్మమ్మ పెన్నాడ మంగాదేవి ఇంటికి కాకినాడ జిల్లా కాజులూరు మండలం జగన్నాధగిరికి చెందిన ప్రణీత్ (9) వచ్చాడు. ఈనెల 14న బాత్‌రూంలో స్నానం చేస్తుండగా జారి పోవడంతో మలద్వారం వద్ద ఇనుపరాడ్డు గుచ్చుకుని పెద్దగాయం కావడంతో యానాం ప్రభుతాసుపత్రికి కుటుంబసభ్యులు తరలించారు. చికిత్స చేసిన వైద్యులు ఇంటింకి పంపించారు. 16న గాయం ప్రదేశంలో ఇన్‌ఫెక్షన్ కాడంతో ప్రణీత్‌ను తిరిగి ఆసుపత్రికి తీసుకెళ్లగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. కాకినాడలో వైద్యులు శనివారం ఆపరేషన్ చేసి ఐసీయూకు తరలించారు. ఆదివారం తెల్లవారుజామున బాలుడు మృతిచెందాడు. మృతదేహానికి బంధువులకు అప్పగించారు. యానాం పోలీసులు కేసు నమోదు చేశారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

చేబ్రోలులో అంబా యాగం, చండీ పారాయణ

గొల్లప్రోలు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): దేశ సంరక్షణ, లోక కల్యాణార్థం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాసం వద్ద ఆదివారం అంబా యాగం, చండీ పారాయణ నిర్వహించారు. జనసేన నాయకుడు ఓదూరి నాగేశ్వరరావు దంపతులు కర్తలుగా పాల్గొని యాగ క్రతువు జరిపించారు. మూడు రోజులు 108సార్లు మణిద్వీప పారాయణ ప్రారంభమైంది. రాత్రి పీఠికాపుర క్షేత్ర వైశిష్ట్యంపై వద్దిపర్తి పద్మాకర్ ప్రవచనం జరిగింది.



పెద్దాపురం నియోజకవర్గ మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

'ప్రతి హామీనీ కుటమి ప్రభుత్వం నెరవేరుస్తుంది'

పెద్దాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ కూటమి ప్రభుత్వం నెరవేస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం టీడీపీ మినీ మహానాడు నిర్వహించారు. తొలుత పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ పెద్దాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్తతో కలిసి కృషి చేస్తానన్నారు. పెద్దాపురం, సామర్లకోట జంట పట్టణాలను మరింత అభివృద్ధి చేస్తానన్నారు. పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ మట్లాడుతూ పేద వర్గాలకు టీడీపీ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నేత రాజా సూరిబాబురాజు, ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, నాయకులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, అడబాల కుమారస్వామి, తోటకూర శ్రీనివాస్, ఎలిశెట్టి నాని, నూనే రామారావు, మొయిళ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న రాయభూపాలపట్నం గ్రామస్తులు, ఎస్ఎంసీ సభ్యులు

'అంకితభావం ఉన్నవారే మా పాఠశాలకు రండి'

పెద్దాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం రాయభూపాలపట్నం గ్రామస్తులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు ఆదివారం వినూత్నంగా ప్రదర్శన నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం బదిలీల ప్రక్రియకు తెరతీయడంతో తమ గ్రామంలో ఉన్న మూడు ప్రభుత్వ పాఠశాలలకు టీచింగ్ పట్ల ప్యాషన్ ఉన్న వారు మాత్రమే ఉపాధ్యాయులుగా రావాలన్నారు. వృత్తిపట్ల నిబద్ధత, అంకిత భావం, విద్యార్థుల తల్లిదండ్రులతో తరచూ మాట్లాడుతూ, పాఠశాలను అభివృద్ధి చేయాలన్న తపనతో ఉన్నవారే రావాలన్నారు. పట్టణానికి దగ్గరగా ఉంటుందని, అలవెన్స్ బాగుంటుందని, సీనియారిటీపరంగా బాగుంటుందని, ఏదో నెట్టుకుపోదాంలే అనే ఉద్దేశ్యంతో ఉన్న వారు మాత్రం రావద్దన్నారు. మంచి ఆశయం ఉన్న ఉపాధ్యాయులు మాత్రమే తమ పాఠశాలను ఎంపిక చేసుకోవాలంటున్నారు. ప్రదర్శనలో ఎస్ఎంసీ చైర్మన్ మన్యం చిన్న, సభ్యులు సూర్యనారాయణ, భవానీ, వెంకటలక్ష్మి, సుబ్బలక్ష్మి, గౌరమ్మ, శ్రీను, త్రినాథ్, ప్రసాద్, ధనుష్, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ

సామర్లకోట, మే 18 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా విగ్రహాల ప్రతిష్ఠ వాడపల్లి గోపాచార్యస్వామి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణలతో ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక కుటుంబీకులు వీరంరెడ్డి పెదబాబు, వీరంరెడ్డి చినబాబు, సలాది బ్రహ్మానంద రావు (రమేష్) దాతృత్వంతో వారి పూర్వీకులు వీరంరెడ్డి వసంతరాయుడు జ్ఞాపకార్థం ఆలయాన్ని పునర్నిర్మించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. అచ్చంపేట ఇస్కాన్ టెంపుల్‌కు చెందిన ఆనంద శేష, సుచిత్రానంద సరస్వతి, ఎమ్మెల్సీ రాజశేఖరం, జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ సతీమణి జ్యోతుల మణి, తోటకూర శ్రీనివాసు పాల్గొన్నారు.



అచ్చంపేటలో విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న వీరంరెడ్డి కుటుంబీకులు

ఉండూరులో సీసీ రోడ్లు ప్రారంభం

సామర్లకోట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉండూరులో ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు ఆదివారం ప్రారంభించారు. టీడీపీ అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మరో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పాల్గొన్నారు. మరో రూ.20లక్షల వ్యయంతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొప్పిరెడ్డి రాజా, కొప్పిరెడ్డి సాంబమూర్తి, మునిరెడ్డి శ్రీరాములు, మునిరెడ్డి రాంబాబు, ఎంపీపీ బి.సత్తిబాబు, సలాది శ్యామలాతాతాజీ, మొసలి బుజ్జమ్మశ్రీనివాసు, ఎంపీడీవో హిమమహేశ్వరి పాల్గొన్నారు.



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప



సదస్సులో మాట్లాడుతున్న జేఎన్టీయూకే మాజీ వైస్ చాన్సలర్ మురళీకృష్ణ

'రియల్ ఎస్టేట్ రంగంలో సవాళ్లపై అవగాహన సదస్సులు నిర్వహించాలి'

కాకినాడ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగం, లే-అవుట్ అభివృద్ధి ప్రాజెక్టులు కుంటుపడుతున్న తరుణంలో రియల్ ఎస్టేట్ రంగాల్లో ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు బిల్డర్లకు, డెవలపర్లకు, ఇంజనీర్లకు అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నారెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధరరావు, జేఎన్టీయూకే మాజీ వైస్ చాన్సలర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పేర్కొన్నారు. జేఎన్టీయూ అలూమ్ని ఆడిటోరియంలో నార్కెడో ఆధ్వర్యంలో 'రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు మేనేజ్మెంట్-ఖర్చు' అంశంపై ఆదివారం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. కాకినాడ చాప్టర్ కార్యదర్శి కాటంరెడ్డి ఉపేష్ స్వాగతం పలుకగా అధ్యక్షుడు పేర్ల వెంకట వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు. కోశాధికారి నాగేశ్వరరావు, కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు వీవీ రమణమూర్తి, సంయుక్త కార్యదర్శి పి.పృథ్వీరాజు, యాళ్ల వెంకటేశ్వరరావు, అధిక సంఖ్యలో బిల్డర్లు, డెవలపర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

మాలమహానాడు నేత చంటిబాబుకు నివాళి

పిఠాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మాలమహానాడు మండల అధ్యక్షుడు నీలం చంటిబాబు సంస్మరణ సభ పిఠాపురం సూర్యరాయ గ్రంథాలయం చెలికాని భావనరావు సభా సదన్‌లో ఆదివారం జరిగింది. మాలమహానాడు పట్టణ అధ్యక్షుడు వేళంగి వెంకటేష్ ఆధ్వర్యంలో నాయకులు చంటిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలమహానాడు, వివిధ సంఘాల నాయకులు బత్తిన శామ్యూల్, ఉలవల భూషణం, ఖండవిల్లి లోవరాజు, రేకళ్ల సూరిబాబు, మహేంద్రాడ సింహాచలం, సాకా రామకృష్ణ, ఈరుగల పవన్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అస్తవ్యస్తం

నిబంధనలకు విరుద్ధంగా భవనాల నిర్మాణం

కొన్నింటికి అనుమతులే లేవు

ప్లాన్లు లేని, నిబంధనలు పాటించని 25 భవనాలు ఇప్పటికే గుర్తింపు

(గొల్లప్రోలు-ఆంధ్రజ్యోతి)

టౌన్ ప్లానింగ్ అంతా అస్తవ్యస్తంగా మారింది. సుదీర్ఘ కాలం ఈ విభాగానికి కీలక అధికారులు లేకపోవడం, ఇన్‌చార్జిలుగా వచ్చిన వారు పట్టించుకోకపోవడంతో ఎక్కడిక్కడ ప్లాన్లు, అనుమతులు లేకుండానే భవనాలు నిర్మించేశారు. తీసుకున్న ప్లానులకు విరుద్ధంగా పలుచోట్ల భవనాల నిర్మాణాలు సాగాయి. అసలు నిబంధనలు పాటించకుండా 25 భవనాలు ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు.

గొల్లప్రోలు నగర పంచాయతీ హోదా పొందినా భవనాల నిర్మాణ విషయంలో ఇంకా పూర్వ పద్ధతే కొనసాగుతోంది. ఎటువంటి అనుమతులూ తీసుకోకుండానే నిర్మాణాలు చేపట్టడం, అనుమతులు పొందిన ప్లానులకు విరుద్ధంగా భవనాలు, షాపింగ్ కాంప్లెక్సులు నిర్మిస్తున్నారు. గతంలో పనిచేసిన అధికారులు, పాలకులు ఇందులో కీలకపాత్ర పోషించి లక్షలాది రూపాయలు వెనుకేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్ విభాగంలో కీలకమైన టీపీవో, టీపీఎస్‌లు, టీపీబీవో పోస్టులు సుమారు ఏడాదిన్నరకు పైగా ఖాళీగా ఉండటంతో భవనాల నిర్మాణంపై పర్యవేక్షణ కొరవడింది.

పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి కొత్తగా నిర్మించిన భవనాల్లో 50శాతం పైగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినట్టు ఆరోపణలున్నాయి. మెయిన్‌రోడ్డుతో పాటు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఒక అంతస్తు వరకు మాత్రమే అనుమతులు తీసుకుని 2, 3, 4 అంతస్తులు నిర్మించడం, సెట్‌బ్యాక్ వదలకుండా, పార్కింగ్ లేకుండా వాణిజ్య సముదాయాల నిర్మాణం, ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకుని షాపుల నిర్మాణం చేపట్టడం, అసలు అనుమతులు తీసుకోకుండానే గృహ, వాణిజ్య భవనాలు నిర్మించడం వంటివి గతంలో జరగడంతో పాటు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఇప్పటికే నగర పంచాయతీ అధికారులు సర్వే నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలు 25 ఉన్నట్టు గుర్తించారు. ప్లాన్లకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై ఆరా తీస్తున్నారు.



గొల్లప్రోలులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనం

జరిమానా విధించి కోర్టుల్లో కేసులు ఫైల్ చేస్తున్నాం

నామ కనకారావు, కమిషనరు, గొల్లప్రోలు నగర పంచాయతీ

ప్లాన్లకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను గుర్తిస్తున్నాం. ఇప్పటికే ఇటువంటి 25 గుర్తించి నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా గుర్తించిన మూడు భవనాలకు రూ. 31.07లక్షలు జరిమానా విధించి కోర్టులో కేసులు ఫైల్ చేశాం. మరో 9 భవనాలపై వారంలోపు కోర్టుల్లో చార్జిషీట్లు వేస్తాం. మిగిలిన భవనాలపైనా చర్యలు ఉంటాయి. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా, ప్లాన్లు లేకుండా నిర్మాణాలు జరిగితే బాధ్యులైన సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకుంటాం.

పసుపుమయం... పండగ వాతావరణం

కాకినాడ సిటీ నియోజకవర్గ మినీ మహానాడు విజయవంతం

కాకినాడ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): పసుపుమయం.. పండగ వాతావరణంతో కాకినాడ సిటీ మినీ మహానాడు విజయవంతమైంది. కాకినాడ సూర్యకళా మందిరంలో ఆదివారం ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో కాకినాడ సిటీ నియోజకవర్గ మినీ మహానాడు జరిగింది. ముఖ్య అతిథులుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, నియోజకవర్గ పరిశీలకుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ విచ్చేశారు. తొలుత పార్టీ పతాకావిష్కరణ చేసి వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ప్రతి పేదవాడికీ కూడు, గూడు, గుడ్డ అందించాలనే ఆశయంతో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. రాష్ట్రం కోసం నిరంతరం పరితపించే ఏకైన నాయకుడు చంద్రబాబునాయుడన్నారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలతో పార్టీ ముందుకు సాగుతోందన్నారు. జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ మాట్లాడుతూ రోజూ వేల సంఖ్యలో వస్తున్న రోగులకు మెరుగైన సేవలందించేలా జీజీహెచ్‌కు అధిక నిధులు కేటాయించాలని తీర్మానం చేయాలని కోరారు. బీసీ, ఎస్సీ, మైనారిటీ, వాణిజ్య, మహిళ, యువత, కార్మిక వర్గాల సంక్షేమంపై పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు గ్రంధి బాబ్జి, బచ్చు శేఖర్, సుంకర తిరుమలకుమార్, పెంకే శ్రీనివాసబాబా, కొల్లాబత్తుల అప్పారావు, పంతాడి రాజు, వొమ్మి బాలాజీ, వాసిరెడ్డి ఏసుదాసు, బోళ్ల కృష్ణమోహన్, కటకంశెట్టి బాబి, వనమాడి మోహనవర్మ, ఎంఏ తాజుద్దీన్, తుమ్మల రమేష్, పినపోతు తాతారావు, బలసాడి రంగారావు, మేకా లక్ష్మణమూర్తి, అరిగెల శ్రీనివాసరావు, సీకోటి అప్పలకొండ, పలవెల రవి, కలగా శివరాణి, మల్లిపూడి నాగదీపిక, తుమ్మల సునీత, చాపల ప్రశాంతి, చొల్లంగి వీరబాబు, గుత్తుల రమణ, దండుప్రోలు నాగబాబు, నల్లూరి శ్రీనివాస్, ఏవీడీ మెంటారావు, అంబటి చిన్న, అమలకంటి బలరాం, రెడ్నం సత్తిబాబు, బంగారు సత్యనారాయణ, ఎస్‌కే రహీమ్, గాది శివరామకృష్ణ, మూగు రాజు, కశంకోట చంద్రశేఖర్, గెడ్డం పూర్ణచంద్రశేఖర్, పాలిక నాని, మూగు రాజు, సంగాని నాగేశ్వరరావు, మల్లాడి గంగాధరం, వనపత్రి బద్రి, చెక్కా శ్రీనివాస్, గుజ్జు లక్ష్మణరావు, పోలిపల్లి జగన్, సిరియాల లక్ష్మి, పీర్ల లక్ష్మీప్రసన్న, కొపనాతి నాగకుమారి పాల్గొన్నారు.



మినీ మహానాడులో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



వేణుగోపాలస్వామికి విశేష అలంకారం

పిఠాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి వైశాఖ మాసం సందర్భంగా అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులు, కోట ఫణీంద్రకుమార శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం మామిడిపండ్లు, వినసకర్రలతో ప్రత్యేక అలంకారం చేశారు. సాయంత్రం వేదపండితుల ఆధ్వర్యంలో వేద స్వస్తి జరిపించారు. ఈవో నున్న శ్రీరాములు, ఆలయ అభివృద్ధి సేవా సమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గొల్లప్రోలు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్ తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ స్కీములో భాగంగా కొత్త లైన్ల ఏర్పాటు కారణంగా చేబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మల్లవరం, ఏవీ నగరం, దుర్గాడ గ్రామాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'హెచ్ఐవీ బాధితులకు అండగా ఉంటాం'

జీజీహెచ్ (కాకినాడ) మే 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్‌లైట్ మెమోరియల్ డేను పురస్కరించుకుని ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తాళ్లరేవుకు చెందిన భీమాబాయి మహిళా మండలి తరపున హెచ్ఐవీతో జీవిస్తున్న 30 మందికి చీరలు పంపిణీ చేశారు. హెచ్ఐవీ బాధితులకు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ ఆర్.రమేష్ ప్రతిజ్ఞ చేయించారు. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజరు కేవీఆర్ శైలజ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

కాకినాడ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌ల రద్దు కోసం జులై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కచేరీపేటలోని కార్యాలయంలో ఆదివారం ఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు జి.రాజ్‌కుమార్, జె.దుర్గారావు, ఎస్.రాజేష్, మహేష్, బంగార్రాజు ప్రసంగించారు.




ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ సమకూర్చిన మాస్కులతో సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్

జీజీహెచ్‌కు 5వేల ఎన్95 మాస్కుల వితరణ

జీజీహెచ్ (కాకినాడ), మే 18 (ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారి కొన్ని దేశాల్లో కోరలు చాస్తున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ సొంత నిధులతో 5వేల ఎన్95 మాస్కులను సమకూర్చారు. వీటిని జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యులు రావుసత్య గోపాల్ అక్షయ్, నున్న దొరబాబు ఆదివారం సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌కు అందజేశారు. అక్షయ్ మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జీజీహెచ్‌లో ప్రత్యేక క్యాన్సర్ యూనిట్ ఏర్పాటుకు ఎంపీ శ్రీకారం చుట్టారన్నారు. తద్వారా సమగ్ర క్యాన్సర్ చికిత్స ల్యాబ్ పరీక్షలు, కీమోథెరపీ, అవసరమైన యంత్రాలు, నిపుణుల సలహాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్, ఏఆర్ఎంవో డాక్టర్ లావణ్య, డాక్టర్ యమున, హెచ్ఐ సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంద కృష్ణ మాదిగ పర్యటన

కాకినాడ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక లేడీస్ క్లబ్ వద్ద గల పార్కులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు ముమ్మిడివరపు చినసుబ్బారావు మాట్లాడుతూ ఎస్.అచ్యుతాపురంలో సోమవారం జరిగే ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొండేపూడి శ్యామ్‌బాబు మాదిగ సంతాప సభలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పాల్గొంటారన్నారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్, ప్రధాన కార్యదర్శి దూలపల్లి వెంకటరమణ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు డోకుబుర్ర భద్రం మాస్టర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరా.జు, జిల్లా అధ్యక్షుడు అనంతవరపు రాజు, లాయర్ల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కిలాడి దయానందరాజు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు చాట్ల ఆశీర్వాదం, ఎంఎస్ఎస్ నాయకులు మోటుకూరి వరలక్ష్మి, తుమ్మలపల్లి చిన్న, కింతాడ సత్తిబాబు, నందిక వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

కాకినాడ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సర్పవరం జంక్షన్ నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు ఆ పార్టీ కాకినాడ రూరల్ మండల శాఖ అధ్యక్షుడు ఎన్.సత్తిబాబు ఆధ్వర్యంలో ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కాకినాడ పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, కాకినాడ సిటీ కన్వీనర్ గట్టు సత్యనారాయణ, రూరల్ కన్వీనర్ లీలావతి, పద్మావతి, జనసైనికులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

'లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం'

తాళ్లరేవు, మే 18 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు లయన్స్ క్లబ్ చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని లయన్స్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్ అన్నారు. తాళ్లరేవు లయన్స్ క్లబ్ సిల్వర్ జూబ్లీని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తాళ్లరేవు పంచాయతీ పరిధిలో రూ.50లక్షలతో అభివృద్ధి చేసిన శ్మశాన వాటిక, అనేక కూడళ్లలో వేసిన 35 సిమెంటు బల్లలను ఈశ్వర్‌కుమార్ ప్రారంభించారు. నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు అందించారు. రక్తదానం శిబిరాన్ని ప్రారంభించి 90వ సారి రక్తదానం చేసిన ధూళిపూడి వెంకటరమణను అభినందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యరాజు, నరేంద్రరెడ్డి, ఆదినారాయణ, శ్రీనివాసరెడ్డి, వినోద్, దత్తు, సతీష్, శ్రీనివాస్, రాయపరాజు, చంటి, ఉమామహేశ్వరరావు, కొప్పిశెట్టి బాబీ, లక్ష్మీపతి, బాబి తదితరులు పాల్గొన్నారు.

25న డీఎస్సీ ఉచిత మోడల్ గ్రాండ్ టెస్ట్

కాకినాడ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ విద్యుత్‌నగర్‌లోని శ్యామ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో ఈ నెల 25న ఎస్టీటీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ తెలిపారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు టెస్ట్ జరుగుతుంది. పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఉపాధ్యాయులు మోడల్ పేపర్‌ను రూపొందించారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 93462 87425 నెంబరుకు వాట్సాప్ ద్వారా వివరాలు మెసేజ్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్సీ రాజశేఖరం

వైభవంగా గంగమ్మ తల్లి జాతర


కాకినాడ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇంద్రపాలెం గొల్లపేటలో గంగమ్మ తల్లి జాతరను టీడీపీ మాజీ ఎంపీటీసీ, కాకినాడ జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాసుమేను గంగయ్య, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కాకినాడ రూరల్ సమన్వయకర్త పిల్లి సత్తిబాబు, కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, ఎమ్మెల్యే నానాజీ సతీమణి అరుణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు గంగమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు. తీన్మార్ డప్పులు, గరగ నృత్యాలు, గారడీ, తప్పెట గుళ్ల ఆకట్టుకున్నాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా యాదవ సంఘం నాయకులు రామారావు, మణితాతారావు, శ్రీను రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రైస్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న నారా లోకేశ్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రతినిధులు

రైస్ బ్యాగ్‌లు, చీరల పంపిణీ

కాకినాడ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి సభ్యులు, అభిమానులకు పంచారు. పెద్ద మార్కెట్ ఏరియాలో సుబ్బు ఆధ్వర్యంలో 200 మంది పేదలకు ఐదు కిలోల రైస్ బ్యాగ్‌లు, చీరలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పులి పద్మకుమారి, జిల్లా అధ్యక్షుడు బత్తుల సూర్యప్రసాద్, పలు మండల శాఖల అధ్యక్షులు అడపా జగదీష్, మండపాక నాగబాబు, నందిక రాధాకృష్ణ, ఆటో యూనియన్ సభ్యులు, జోసెఫ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



దత్తాత్రేయుడిని అభినందిస్తున్న వర్మ

'గేట్' ర్యాంకర్‌కు అభినందన

పిఠాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): గేట్‌లో 110వ ర్యాంకు సాధించిన గొల్లప్రోలు మండలం వన్నెపూడికి చెందిన దత్తాత్రేయుడిని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆదివారం అభినందించారు. కార్యక్రమంలో వన్నెపూడి సర్పంచ్ కందా సుబ్రహ్మణ్యం, టీడీపీ గొల్లప్రోలు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉలవకాయల దేవేంద్రుడు, మల్లిపూడి వీరబాబు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్ పాల్గొన్నారు.

1600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

తుని రూరల్, మే 18 (ఆంధ్ర జ్యోతి): ప్రత్తిపాడు సమీపంలోని శుద్దగడ్డ వాగు వెంబడి సారా తయారీ బట్టీలపై ఎక్సైజ్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 16డ్రమ్ములలోని 1600లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. దాడుల్లో సీఐ శివప్రసాద్, ఎస్ఐ పి.వంశీరాం సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



ఆదమరిస్తే అంతే!

» రహదారిపై ఇటుకలు పెడుతున్న వర్తక షాపుల యజమానులు

» పాదచారులు, వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం

జగ్గంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట-కాకినాడ ప్రధాన రహదారిలో కొందరు వర్తక షాపుల యజమానులు తమ షాపుల ఎదురుగా ఎవరూ వాహనాలను పార్కింగ్ చేయరాదని హెచ్చరిస్తున్నారు. ఒక వ్యాపారస్తుడు అయితే ఇటుకలు పెట్టాడు. అయితే వీటిని ఇలానే ఉంచితే రాత్రిళ్ల అనేక మంది పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి వీటిని తీయించడంతో పాటు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న షాపు యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'ఆదిత్య'లో ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు

గండేపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): దేశంలో 23 ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు దేశవ్యాప్తంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వ విద్యాలయం ప్రాంగణంలో ఉన్న సెంటర్లలో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరిగాయన్నారు. 400మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజరయ్యారన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి

ప్రత్తిపాడు, మే 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను కార్యకర్తలు, అభిమానులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని నియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కోరారు. మండలంలోని శరభవరం, ఒమ్మంగి, గజ్జనపూడిలో ఆదివారం ఆయన పర్యటించి పార్టీ కార్యకర్తలను కలిశారు. వైసీపీ బలోపేతానికి,పూర్వ వైభవానికి ఇప్పటి నుంచే పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రామిశెట్టి నాని, రామిశెట్టి దొరబాబు, సర్పంచ్ గొనగాల అప్పలరాజు, వైస్ ఎంపీపీ బంకు శ్రీను, గువేరా, అమరాది కాశీ, రంగనాధం అబ్బాయి పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రంపచోడవరంలో తిరంగా ర్యాలీ


రంపచోడవరంలో తిరంగా ర్యాలీ చేస్తున్న దృశ్యం

రంపచోడవరం మే 18: ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో భారత సైనిక దళాలకు సంఘీభావంగా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. అంబేడ్కర్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. యుద్ధంలో చనిపోయిన వీరజవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భారత సైనికులకు మనందరం రుణపడి ఉన్నామన్నారు. తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఆర్మీ మాజీ జవాన్ గోవిందరావును సన్మానించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చిన్నం బాబూరమేష్, జీసీసీ డైరెక్టర్ గొర్లె సునీత, టీడీపీ నాయకులు సురేష్‌బాబు, అనంత మోహన్, అడబాల బాపిరాజు, నిరంజనిదేవి, ముస్లిం మత పెద్దలు ఎండీ గౌస్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ టీచర్ పోస్టులను ఆదివాసీలతో భర్తీ చేయాలి

రాజవొమ్మంగి, మే 18(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులు ఆదివాసీలతోనే భర్తీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ సమావేశం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా అప్పలనర్స మాట్లాడుతూ ఈనెల20న నిర్వహించే కేబినెట్ సమావేశంలో ఆదివాసీలకు అనుకూలంగా సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవాలన్నారు. 2025 మెగా డీఎస్సీలో ఏజెన్సీ ఆదివాసీలకు నూరు శాతం టీచర్ పోస్టులు కేటాయిస్తూ మే 15నాటికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వల్ల ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగేలా ఉందన్నారు. కార్యక్రమంలో ఆదివాజీ నాయకులు వెదుల్ల లచ్చిరెడ్డి, వంతు బాలకృష్ణ, కొండ్ల సూరిబాబు, గంపా నాగరాజు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

ఈదురుగాలులకు నేలకూలిన భారీవృక్షం


రహదారి మీద పడిన భారీ వృక్షం

మారేడుమిల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆదివారం వీచిన ఈదురుగాలులు, భారీ వర్షానికి భారీ వృక్షం నేల కూలింది. రహదారికి అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రంపచోడవరం - మారేడుమిల్లి మధ్యలో దేవరపల్లి సమీపంలో వృక్షం పడిపోవడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అంతరాష్ట్ర రహదారి కావడంతో మారేడుమిల్లి మీదుగా తెలంగాణ, ఛత్తీసగఢ్ రాష్ట్రాలకు వెళ్లే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. రెండు గంటల తరువాత చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.


సీలేరు నదిలో సేద తీరుతున్న చిన్నారులు

భానుడి భగభగ..సీలేరు నదిలో చిన్నారుల సేద

మోతుగూడెం, మే 18 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో పగటి పూట ఉష్ణోగ్రత 40 డిగ్రీలు నమోదైంది. సూర్యుడి ప్రతాపానికి జనం బయటకు రాలేక అల్లాడిపోతున్నారు. పిల్లలు, పర్యాటకులు అధిక సంఖ్యలో సీలేరు నది, పొల్లూరు జలపాతాల్లో స్నానాలు చేసి సేద తీరారు. కొందరు సీలేరు నది ఒడ్డున, చెట్ల నీడన సేదతీరారు. వేసవి తాపానికి భరించలేక కొబ్బరినీళ్లు, తాటిముంజులు, శీతల పానీయాలు సేవించారు. సాయంత్రం 6గంటల వరకు జనం రోడ్లపై కనిపించడం లేదు. ఇళ్లకే పరిమితమవుతున్నారు.

మురికినీరే మూగజీవాలకు దాహార్తి

వై.రామవరం, మే 18(ఆంధ్రజ్యోతి): వేసవి తాపానికి అల్లాడుతున్న మూగజీవాలు చుక్క నీరు ఎక్కడ దొరికితే అక్కడే దాహార్తిని తీర్చుకుంటున్నాయి. మంచి నీరైనా మురికి నీరైనా సరే అవే వాటికి దిక్కు. పశువులు దాహార్తిని తీర్చుకునేందుకు ప్రభుత్వం నీటి తొట్టెలను ఏర్పాటు చేసింది. అయితే అవి మండలంలో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆరు బయట పశువులకు చుక్క నీరు దొరక్క, ఎండలకు తాళలేక అలమటిస్తు వాటికి బురద నీళ్లే గతవుతున్నాయి.


బురదనీటితో దాహార్తి తీర్చుకుంటున్న మూగజీవాలు

ఏజెన్సీలో పలుచోట్ల వర్షం

ఎటపాక, మే 18(ఆంధ్రజ్యోతి): ఎటపాక ఏజెన్సీలో ఆదివారం సాయంత్రం గంట పాటు వర్షం కురిసింది. గన్నవరం, తోటపల్లి, కృష్ణవరం, గౌరిదేవిపేట, నందిగామ, నెల్లిపాక తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో ఇప్పటి వరకు ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడిపోతున్న జనాలకు ఈవర్షం కాస్త ఉపశమనం కలిగించింది. వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. వర్షంతో పాటు గాలి వీచడంతో ఏజెన్సీలో కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


గన్నవరంలో వర్షం కురుస్తున్న దృశ్యం

ముమ్మరంగా వాహన తనిఖీలు

మోతుగూడెం, మే 18 (ఆంధ్రజ్యోతి): వాహనచోదకులు రోడ్డు భద్రతా నియమాలు విధిగా పాటించాలని మోతుగూడెం ఎస్ఐ సాదిక్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు ధ్రువపత్రాలతో పాటు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపినా, అతి వేగం వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు రావాల్సి ఉంటుందన్నారు. ప్రైవేట్ ఆటో, జీపు వంటి వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే జరిమానాతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.


కారును తనిఖీ చేస్తున్న మోతుగూడెం ఎస్ఐ సాదిక్, పోలీస్ సిబ్బంది

నేడు అన్నవరంలో మినీ మహానాడు


ప్రత్తిపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గ మినీ మహానాడును నియోజకవర్గ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు జయప్రదం చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కోరారు. స్థానిక తోటవీధిలోని పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 19న సోమవారం మధ్యాహ్నం 2నుంచి అన్నవరం హరిహర రిసార్ట్స్ కన్వెషన్ కల్యాణ మండపంలో మినీ మహానాడు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొనే ఈ మినీ మహానాడు విజయవంతం చేసేందుకు నాలుగు మండలాల నుంచి కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదిగిన తెలుగుదేశం పార్టీ తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకుందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత జరిగే మొట్టమొదటి మహానాడును అదే పట్టుదలతో విజయవంతం చేయాలన్నారు. ఈనెల 22న కాకినాడలో జరిగే జిల్లా మహానాడును, ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కడప జిల్లాలో ఈ నెల 27, 28న పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్, పల్లా శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర మహానాడుకు భారీ ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు వెన్నా శివ, సీబీఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్, పర్వత సురేష్, మండలాధ్యక్షులు అమరాది వెంకట్రావు, మూది నారాయణస్వామి, సూది బూరయ్య, బద్ది రామారావు, తమరాన సత్యనారాయణ, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, దంటుముళ్ళ రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి,

జయప్రదం చేయండి: ఎమ్మెల్యే సత్యప్రభ

మూది నారాయణస్వామి, మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, మాజీ ఎంపీపీ ఇతంశెట్టి సూర్యభాస్కర్, టీడీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైలా సాంబశివరావు, బసవా ప్రసాద్, బుద్ధ సూర్యప్రకాష్, రాజాల చిట్టిబాబు, మిరపల నర్సయ్య, పల్లాగోపి, కీర్తి సుభాష్, జగటాపు సూరిబాబు, ముమ్మిడి సత్యనారాయణ, పంచాది వీరబాబు,పలివెల సతీష్, డి. కృష్ణ పాల్గొన్నారు.

మినీ మహానాడుకు ఏర్పాట్లు

సభాస్థలిని పరిశీలించిన యనమల

తుని రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న తుని నియోజకవర్గంలోని నిర్వహించే మినీ మహానాడుకు ఎమ్మెల్యే దివ్య ఆదేశాలతో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. తేటగుంటలో సభా ఏర్పాట్లను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పరిశీలించారు.అనంతరం స్థానిక నాయకులతో మాట్లాడి సభ విజయవంతం చేసేందుకు ఏర్పాట్లపై పలు సూచనలిచ్చారు. ఆయన వెంట యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి అబ్బాయి, పోలిశెట్టి రామలింగేశ్వరరావు ఉన్నారు.

విజయవంతం చేయాలి

రౌతులపూడి, మే 18(ఆంధ్రజ్యోతి): అన్నవరంలో జరిగే మినీ మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. మూలగపూడిలో ఆయన నివాసంలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అధ్వర్యంలో అన్నవరంలో హరిహర రిసార్ట్స్‌లో మినీ మహానాడును నిర్వహిస్తున్నారని, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి కోరారు.


తేటగుంట మినీ మహానాడు స్థలాన్ని పరిశీలిస్తున్న యనమల

ఆపరేషన్ సిందూర్ విజయవంతం


తిరంగా ర్యాలీ దృశ్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన

జగ్గంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): పహల్గాం దాడికి ప్రతి చర్యగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. జగ్గంపేట, గోకవరం మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించారు. పహ ల్గాం ఉగ్రదాడికి ప్రతి చర్యగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. జగ్గంపేట, కిర్లంపూడి, గోకవరం, గం డేపల్లి మండలాల బీజేపీ నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు. భారత్‌మాతాకీ జై, వందేమాతరం అంటూ నినాదాలతో జగ్గంపేట ప్రధాన రహ దారిలో జాతీయ పతాకాలు చేత పట్టి యాత్ర కొనసాగించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ భారత చర్యలను ప్ర పంచ దేశాలన్నీ కూడా ఆమోదించాయని, పాకిస్థాన్ ఉగ్రవాదులకు మద్దతు ఇవ్వడం మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకుంటుందన్నారు. జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ, జగ్గంపేట నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ తదితరులు మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదులను ఉసిగొల్పితే భారత్ చూస్తూ ఊరుకోదని తగిన గుణపాఠం చెబుతుంద న్నారు. మాజీ సైనికుడు బుద్దరాజు జగన్నాధరాజుని సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ బీజేపీ కౌన్సిల్ సభ్యులు సత్తి వెంకటరెడ్డి, గారపాటి రాజేశ్వరరావు, కిర్లంపూడి మండలాధ్యక్షుడు శరకణం రాజబాబు, గండేపల్లి మండలాధ్యక్షుడు తోరాటి వెంకన్న, జగ్గంపేట మండలాధ్యక్షుడు పల్లా రాము, గోకవరం మాజీ మండలాధ్యక్షుడు ముక్కా శ్రీను, జగ్గంపేట నియోజకవర్గ బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ కాకి మణికంఠ, గోకవరం మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి ముప్పిడి నాగేశ్వరరావు, కోశాధికారి ముమ్మిడివరపు రామకృష్ణ, సీనియర్ నాయకులు బత్తుల వెంకన్నబాబు, ఉంగరాల ఆదివిష్ణు, పిల్లా సత్యనారాయణ, బత్తుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి


రాంబాబుకు పార్టీ కండువా కప్పుతున్న పీసీసీ సభ్యుడు శ్రీను

పీపీపీ జనరల్ సెక్రటరీ మల్లిపూడి రాంబాబు

ప్రత్తిపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పీపీపీ జనరల్ సెక్రటరీ మల్లిపూడి రాంబాబు కోరారు. ఆదివారం మండలంలోని ప్రత్తిపాడు, ఒమ్మంగిలలో ఆయన పర్యటించారు. స్థానిక అంబేడ్కర్ కళామందిర్ సెంటర్ వద్ద మల్లిపూడికి పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను కార్యకర్తలు కండువా కప్పి ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో బడుగు బలహీన వర్గాలు, పేద ప్రజలకు ఎంతో మేలు చేసే కార్యక్రమాలు అమలయ్యేవన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేసేందుకు అన్నివర్గాల ప్రజలు సహకారం, తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో టి.శ్రీను, కోన సూరిబాబు, వి.శ్రీనివాస్, మూరా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత


స్కాలర్‌షిప్ అందజేస్తున్న బావిశెట్టి శ్వేత, రమణ

కిర్లంపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగపతినగరం ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాలలో పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కరస్పాండెంట్ బావిశెట్టి శ్వేత, రమణ స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేపట్టారు. సుమారు 500మంది హాజరయ్యారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 50 మందిని ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ తాలపురెడ్డి నాగసతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.8వేలు, మూడో బహుమతిగా రూ.6వేలు, పదిలోపు ఎంపికైన వారికి రూ.4వేలు, మిగతా 40మందికి రూ.2వేలు చొప్పున అందజేశారు. ముందుగా విద్యార్థులకు నీట్, జేఈఈ పరీక్షలు అవగాహన కల్పించారు.

పూడికతీత ఎప్పటికి పూర్తయ్యేనో!

సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టు పరిధిలో పూర్తి కాని కాలువల అభివృద్ధి పనులు


సగం వరకే జరిగిన ప్రత్తిపాడు కాలువ పూడిత తీత పనులు

ప్రత్తిపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టు పరిధిలోని కాలువల అభివృద్ధి పనులు ఇంకా పూర్తికాలేదు. సుబ్బారెడ్డి సాగర్ ప్రధాన మదుం నుంచి పొదురుపాక వరకు 3.5 కిలోమీటర్ల కాలువ అభివృద్ధి పనులకు రూ.8 లక్షలు మంజూరుకావడంతో పూడికతీత నిర్వహించారు. అయితే సాగర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఏలేరు వెంకటపతిరాజు చెరువు నుంచి ప్రత్తిపాడు వరకు నాలుగుకిలోమీటర్ల పంట కాలువల పూడిక తీత పనులకు రూ.9 లక్షలు మంజూరు కాగా ఆ పనులు ఇంకా పూర్తి కాలేదు. దీని వల్ల రాబోయే ఖరీఫ్ వ్యవసాయ సాగుకు సంబంధించి రైతాంగం ఇప్పటికే దుక్కులు పనులు ప్రారంభించిన నేపథ్యంలో కాలువల్లో పూడిక తీతలు పూర్తికాకపోవడం వల్ల సాగర్ ప్రాజెక్టు జలాలు సజావుగా ఆయకట్టు పొలాలకు సరఫరా జరుగుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

'పాడి పశువులకు ఇన్సూరెన్స్ కల్పించండి'


పాడి పశువులు

జగ్గంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు ఇన్సూరెన్స్ కల్పించాలని మెట్ట ప్రాంత రైతాంగం కోరుతోంది. తాము రూ.లక్షపైబడి ఆవులు, గేదెలను కొనుగోలు చే సి కేంద్రాలకు పాలు పోస్తున్నామని అయితే ప్రతి వస్తువుకు ఇన్సూరెన్స్ ఉంటుంది గానీ మానవాళికి నిత్యం అవసరమయ్యే పాలు వాటిని ఉత్పత్తి చేసే పశువులకు ఇన్సూరెన్స్ లేదా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ పశువులకు ఏమైనా ఇబ్బంది కలిగితే పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని, మెట్ట ప్రాంతంలో పశుగణన చేపట్టి పాడి పశువులకు తక్షణమే ఇన్సూరెన్స్‌లు కల్పించాలి మెట్ట ప్రాంతంలోని పాడి రైతులు కోరుతున్నారు.

అమ్మవారికి భక్తుల పూజలు

దేవీపట్నం, మే 18(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, గొందూరు గ్రామ చోదేవారి ఆడపడుచు స్వయంభూ మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో మైదాన ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. వేకువజామున పవిత్రమైన గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయ సిబ్బంది సౌకర్యాలు కల్పించారు.

బెల్టుషాపులపై పోలీసుల దాడి

రాజవొమ్మంగి, మే 18(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగిలో బెల్టుషాపులపై ఆదివారం సీఐ సన్యాసినాయుడు ఆదేశాలతో ఎస్ఐ నరసింహమూర్తి దాడి చేశారు. ఒక దుకాణంలో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న పది బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బడదనాంపల్లి పంచాయతీ కిమ్మలగడ్డ గ్రామంలో మరో బెల్టుషాపుపై దాడిచేసి, తొమ్మిది క్వాటర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీటి విలువ రూ.3197 ఉంటుందన్నారు. వీటిపై కేసులు నమోదు చేశామన్నారు. సంబంధిత వ్యక్తులను అరెస్టు చేశామన్నారు.

నాలుగో రోజు దీక్షలో ఆదివాసీ చిన్నారులు

చింతూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మన్యంలో స్థానిక ఆదివాసీలకే నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న డిమాండ్‌తో ఆదివాసీలు చింతూరు ఐటీడీఏ ముందు చేపట్టిన దీక్ష ఆదివారానికి నాలుగో రోజుకు చేరుకుంది. దీక్షను ఏపీ ఆదివాసీ జేఏసీ సెంట్రల్ కమిటీ సభ్యుడు మడివి నెహ్రూ ప్రారంభించారు. ఈసందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ భావి తరాల కోసం చేపట్టిన ఉద్యమాన్ని ప్రతి గ్రామం, ప్రతి పల్లె సొంతం చేసుకోవాలన్నారు. ఈ ఉద్యమ ఆవశ్యకతను ప్రభుత్వం అర్థం చేసుకుని తక్షణమే మన్యంలో ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివాసీ చిన్నారులు దీక్షలో పాల్గొని ఉద్యమంలో పాలు పంచుకున్నారు. కార్యక్రమంలో వీసాల లక్ష్మి, వేట్ల శివరాజ్ కుమార్, మడివి గురుత్వ సమంద సింగ్, మడివి సూక్ష్మ సరంద సింగ్, తాటి మోక్ష, త్రయంబిక, కారం చందన సాయి ప్రియ, పద్దం కృష్ణవేణి, మడివి నవ్య, మడివి మీనాక్షి, మడివి జ్యోతి, తాటి పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న ఆదివాసీ చిన్నారులు


బురదవలసలో రోడ్డు వేస్తున్న యువకులు

శ్రమదానంతో రహదారి

వై.రామవరం, మే 18(ఆంధ్రజ్యోతి): అదొక మారుమూల అటవీ ప్రాంతం. నడక దారి కూడా సరిగా లేకపోవడంతో పాఠశాల విద్యార్థులు, కొందరు యువకులు పలుగు, పార పట్టారు. అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలోని లోతట్టున ఉన్న దారగడ్డ పంచాయతీ బురదవలసలో విద్యార్థులు, యువత శ్రమదానంతో రోడ్డు వేసుకుని ఆదర్శంగా నిలిచారు. అధికారులు ఎవరూ స్పందించకపోవడంతోనే కొండల్లో ఉన్న తాము రహదారిని నిర్మించుకున్నామని వారు తెలిపారు.